# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 1 సంచిక : 334 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం బుధవారం 7 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 334 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM WED 7 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


# ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం వద్దు..

## రాజధాని పనులపై చంద్రబాబు సమీక్ష.. కీలక ఆదేశాలు



- నెలకు రూ.2 వేల కోట్ల విలువైన పనులు పూర్తి చేయాలని లక్ష్యం
- గత నెలలో రూ.1,345 కోట్ల పనులు జరిగాయని అధికారులు వెల్లడి
- ఔటర్ రింగ్ రోడ్డుపై దృష్టి సారించాలని అధికారులకు ఆదేశం
- ప్రస్తుతం 41 వేల మంది కార్మికులతో కొనసాగుతున్న పనులు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. రాజధాని ప్రాంతంలో ప్రతి నెలా కనీసం రూ. 2 వేల కోట్ల విలువైన పనులను పూర్తి చేయాలని ఆయన అధికారులకు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణతో పాటు వివిధ నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సీఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.గత నెలలో రాజధాని పరిధిలో రూ. 1,345 కోట్ల విలువైన పనులు పూర్తయినట్లు అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నివేదించారు. నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా చేరుకోవాలంటే పనుల వేగాన్ని మరింత పెంచాలని చంద్రబాబు సూచించారు. ప్రస్తుతం అమరావతిలో 152 ప్రాజెక్టులకు సంబంధించి సుమారు 41 వేల మంది కార్మికులు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని మంత్రి నారాయణ వివరించారు. వివిధ నిర్మాణ సంస్థలు చేపట్టిన పనుల పురోగతిని సీఎం స్వయంగా

ఆరా తీశారు.రాజధాని అభివృద్ధిలో కీలకమైన ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ప్రాజెక్టు పనులను త్వరితగతిన పట్టాలెక్కించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం చోటుచేసుకోకూడదని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.



## టీడీపీ అంతర్గత వివాదాలపై పల్లా శ్రీనివాసరావు దృష్టి..

### నేతలకు కీలక సూచనలు

- తిరువూరు టీడీపీ వివాదంపై రంగంలోకి దిగిన పల్లా శ్రీనివాసరావు
- ఎమ్మెల్యే కొలికపూడి, బాలకోటయ్యలకు కీలక సూచనలు
- దెందులూరు టోల్‌ప్లాజా ఘటనపైనా విచారణ
- చింతమనేని నుంచి వివరాలు అడిగి తెలుసుకున్న శ్రీనివాసరావు
- క్రమశిక్షణ పాటించాలని నేతలకు స్పష్టం

పెన్ పవర్ డెస్క్:తెలుగుదేశం పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాల పరిష్కారంపై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రత్యేక దృష్టి సారించారు. తిరువూరు నియోజకవర్గంతో పాటు దెందులూరు ఎమ్మెల్యేకు సంబంధించిన వివాదాలపై ఆయన లోతుగా విచారణ చేపట్టారు. ఈ క్రమంలో సంబంధిత నేతలను పార్టీ కేంద్ర కార్యాలయానికి పిలిపించి, వారి నుంచి వివరణ కోరారు.ముందుగా,

- మిగతా 2లో

## స్థానిక సంస్థల్లో 34 శాతం బీసీ కోటా..

## సుప్రీంకోర్టులో గెలుస్తాం

- ఢిల్లీలో న్యాయ నిపుణులతో చర్చలు జరిపిన టీడీపీ నేతలు
- బీసీలంటే వైసీపీకి ఎందుకంత వ్యతిరేకత అని రామ్మోహన్ నాయుడు ప్రశ్న
- బీసీలకు రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని మండిపాటు



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుక బడిన తరగతుల కు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు సుప్రీం కోర్టులోనూ పూర్తి అవకాశం ఉందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ధీమా వ్యక్తం చేశారు. ఈ లక్ష్యంతోనే ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును

- మిగతా 2లో

## 100 కోట్ల ప్రయాణాలతో 'స్త్రీ శక్తి' చారిత్రాత్మక ఘనత.. చంద్రబాబు హర్షం

- స్త్రీశక్తి పథకం కింద 100 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు పూర్తి
- రోజుకు సగటున 24 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం
- ఈ పథకం ద్వారా మహిళలకు రూ.3,550 కోట్ల ఆదా జరిగిందన్న సీఎం
- మహిళలతో పాటు ఆర్టీసీ సిబ్బందికి ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు

ఆంధ్రప్రదేశ్‌లో మహిళల కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'స్త్రీశక్తి' పథకం చారిత్రాత్మక మైలురాయిని చేరుకుంది. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా మహిళలు 100 కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణాలు పూర్తి చేసుకున్నారు. ఈ ఘనత పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆదరణ, మాతృమూర్తుల ఆమోదంతోనే ఈ విజయం

- మిగతా 2లో





## వాయు సేన కొత్త అధిపతిగా.. ఎయిర్ మార్షల్ ఆశుతోష్ దీక్షిత్

పెన్ పవర్ డెస్క్:భారత వాయుసేన 29వ నూతన అధిపతిగా ఎయిర్ మా ర్షల్ ఆశుతోష్ దీక్షిత్ నియమితుల య్యారు. ప్రస్తుతం వాయుసేన వైస్ చీఫ్‌గా సేవలందిస్తున్న ఆయన, అక్టోబర్ 31 నుంచి

వివరాలు 2లో..



## 5 అసెంబ్లీ,1 లోక్‌సభకు బైపోల్స్..

### అక్టోబర్ 9న ఎన్నికల ఫలితాలు

పెన్ పవర్ డెస్క్:తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అస్సాం ,కేంద్రపాలిత ప్రాం తం పుదుచ్చేరిలో ఐదు అసెంబ్లీ స్థానాల కు, ఒక లోక్‌సభ నియోజకవర్గానికి మంగళవారం ఉప ఎన్నికలు జరిగాయి. పోలింగ్ జరిగిన నియోజకవర్గాలలో తమిళనాడులోని

వివరాలు 2లో..



## ఒక్క మిల్లీమీటర్ మా భూభాగంలోకి వచ్చినా తీవ్ర పరిణామాలు తప్పవు

### దక్షిణ కొరియాకు ఉత్తర కొరియా హెచ్చరిక

వివరాలు 2లో..

## ఢిల్లీ ఆకాశవాణి భవన్ వద్ద ఉద్రిక్తత

### పోలీసుల అదుపులో రాహుల్ గాంధీ, ప్రియాంక..

- సీఈసీ రాజీనామా కోరుతూ ఢిల్లీలో విపక్షాల భారీ నిరసన
- పార్లమెంట్ నుంచి ఈసీ కార్యాలయానికి ఇండియా కూటమి ర్యాలీ
- బారికేడ్లు ఎక్కి నిరసన తెలిపిన రాహుల్ గాంధీ
- రాహుల్, ప్రియాంక, అఖిలేశ్ సహా పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఆకాశవాణి భవన్‌లో బైఠాయించి కొనసాగుతున్న ఆందోళన



పెన్ పవర్ డెస్క్:దేశ రాజధాని ఢిల్లీ మంగళవారం విపక్షాల ఆందోళనతో దద్దరిల్లింది. ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'ఇండియా' కూటమి చేపట్టిన నిరసన కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు, హైడ్రామాకు దారితీసింది. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు ఎంపీలను

- మిగతా 2లో



## చిన్న పరిశ్రమలకు రూ.10వేల కోట్లు పెట్టుబడులు..

### రవాణా రంగానికి మాస్టర్ ప్లాన్: కేంద్ర కేబినెట్

**ప్రధాని మోడీ అధ్యక్షతన భేటీ అయిన కేంద్ర మంత్రివర్గం దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా 2 కీలక చారిత్రాత్మక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి రూ.10వేల కోట్ల కేటాయింపుతో పాటు.. రవాణా అండ్ లాజిస్టిక్స్ రంగాన్ని సమన్వయం చేయడానికి 'ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ లాజిస్టిక్స్ అథారిటీ' ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.**

పెన్ పవర్ డెస్క్: దేశంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో వృద్ధి దశలో ఉన్న కంపెనీలకు ఈ 'ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్' ద్వారా ప్రత్యక్ష ఈక్విటీ పెట్టుబడులు అందనున్నాయి. ఇప్పటివరకు మార్కెట్లో ఉన్న మెజారిటీ ఫండ్స్ అన్నీ కేవలం ప్రారంభ దశలో ఉన్న మైక్రో పరిశ్రమలకే పరిమితం కావడం వల్ల గ్రోత్-స్టేజ్ క్యాపిటల్ కొరత తీవ్రంగా ఉంది. ఈ లోపాన్ని సరిదిద్దేందుకే ప్రభుత్వం రూ.10వేల కోట్లతో ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తోందని కేంద్రం వెల్లడించింది.

- మిగతా 2లో

## పాక్ గూఢచర్య నెట్‌వర్క్‌ను ఛేదించిన ఏపీ ఇంటెలిజెన్స్.. ఇద్దరి అరెస్ట్

- ఆపరేషన్ ఫైర్‌వాల్-2026తో పాక్ గూఢచర్య ముఠా గుట్టురట్టు
- విశాఖ నేవీ స్థావరాల సమాచారమే లక్ష్యంగా కుట్ర
- 13 మంది నేవీ సిబ్బంది సహా 18 మందిపై నిఘా
- విశాఖ, కోయంబత్తూర్‌లలో ఇద్దరిని అరెస్ట్ చేసిన అధికారులు
- డబ్బు కోసం రహస్య సమాచారం చేరవేసినట్లు ఆరోపణలు

- మిగతా 2లో





## హార్ముజ్ లో వాణిజ్య నౌకపై క్షిపణి దాడి..

### 11 మంది భారతీయ నావికులకు గాయాలు

పెన్ పవర్ డెస్క్:హార్ముజ్ జలసంధి సమీపంలోని ఒమన్ తీరంలో పనామా జెండాతో ప్రయాణిస్తున్న ఎంటీ ఆన్ పీస్ వాణిజ్య నౌకపై క్షిపణి దాడి జరిగింది. ఈ ఘటనలో నౌకలో ఉన్న

- మిగతా 2లో

## బీసీ రిజర్వేషన్ల భయంతోనే వైసీపీ కోర్టులకు వెళుతోంది

- బీసీల సంక్షేమంపై వైసీపీకి చిత్తశుద్ధి లేదన్న మండిపల్లి
- 34 శాతం రిజర్వేషన్లు కల్పించి తీరుతామన్న మంత్రి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిదే విజయమని ధీమా



పెన్ పవర్ డెస్క్:స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా బీసీల రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుందనే భయంతోనే వైసీపీ కోర్టులను ఆశ్రయిస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి

- మిగతా 2లో

# అధికారులు మా రోడ్డు వైపు ఒక్కసారి చూడండి మహాప్రభు...



**అడ్డతీగల, పెన్ పవర్, అక్టోబర్ 06;** స్థానిక పాత పంచాయతీ కార్యాలయం వెనుక ఉన్న రెండు సిమ్మెంటు రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారయింది. దీనికి కారణం సరియైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం. దీనికి తోడు సిమెంట్ రోడ్డు ఆనుకుని ఉన్న స్థల సముదాయం ఇరుకు కావడమేనని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. అసలే అడపాదడబాగా వర్షాలు పడడం ,దీనికి తోడు ఆ చుట్టు ప్రక్కల ఉన్న గృహ సముదాయాల నుండి వచ్చే మురికి నీరు రోడ్లపైకి రావడం కొద్దిపాటి వర్షానికి చెత్తాచెదారం కొట్టుకు రావడం ,ఇవన్నీ ఏకం కావడంతో ప్రస్తుతం కాలమాన ప్రకారం విష జ్వరాలు ,డెంగ్యూ జ్వరాలు ప్రబలుతున్న కారణంగా వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ,ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు రోడ్లపై నడవాలి అంటేనే పాదచారులు పడే ఇబ్బంది వర్ణాతీతం. ఈ ఇబ్బందికర పరిస్థితి ఎందుకంటే ఈ రెండు రోడ్డులు మురికి నీరుతో నిండిపోవడం వలన విపరీతమైన దుర్గంధం వెదజల్లుతుంది, ఎన్ని మార్లు అధికారులకు విన్నవించుకున్న ఫలితం మాత్రం శూన్యమని ప్రాంత వాసులు చెబుతున్నారు. ఏ రాజకీయ ఒత్తిళ్లు లేని స్పెషల్ ఆఫీసర్ పాలనలో నైనా ఈ డ్రైనేజీ వ్యవస్థ చేపడితే అధికారులకు ఎంతైనా రుణపడి ఉంటామని ఈ ప్రాంతవాసులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి



## మళ్లీ 'పులి' సంచారం
# అప్రమత్తమైన అధికారులు

**సీతానగరం, పెన్ పవర్, అక్టోబర్ :06** గత కొంతకాలంగా పలు జిల్లాల్లో సంచరిస్తూ పశువులకు హాని కలిగిస్తున్న పెద్దపులి తాజాగా మళ్లీ తూర్పుగోదావరి జిల్లా వాసులనుహడలెత్తిస్తోన్న పెద్ద పులి... మళ్లీ దాడులు చేస్తూ భయాందోళనలకు గురి చేస్తోంది.సీతానగరం మండలంలోని పెద్ద కొండేపూడి చీపురుపల్లి పరిసర ప్రాంతాల్లో పెద్దపులి ప్రవేశించడంపై తీవ్ర కలకలం రేపింది. పెద్దపులి సంచరించినట్లుగా అటవీశాఖ అధికారులు మంగళవారం తెల్లవారుజామున గుర్తించారు. అడవి శాఖ పోలీసులు సంయుక్త గాలింపు చర్యలు వేగవంతం చేశారు. ప్రస్తుతం నేలకోట రామవరపు ఆవ వెనక కొండ ప్రాంతం పెద్ద కొండెపూడి కొండల వద్ద పెద్దపులి మఖం వేసిందని బయట ప్రాంతాల్లో ఒంటరిగా రైతులు వ్యవసాయ కూలీలు తిరగొద్దని సీతానగరం తాసిల్దార్ అంకం శ్రీనివాస్ సూచించారు.ప్రజలు ఎవరూ ఒంటరిగా అటు వైపు వెళ్లవద్దని, చెరువుల వద్దకు వెళ్లరాదని ఎస్సై ఎల్. శ్రీను నాయక్ స్పష్టం చేశారు. ముఖ్యంగా పశువులను ఆరుబయట కట్టేయకుండా, పాకల్లో ఉంచి రాత్రి వేళల్లో లైట్లు వేసి ఉంచాలని గైడ్‌లైన్స్ ఇచ్చారు. ప్రస్తుతం పగటి సమయంలో పెద్దపులి బయటకు రాకపోవడంతో ఇబ్బందులు లేవని చీకటి పడిన తర్వాత అది సంచరించే ప్రాంతాలను దానికున్న ట్రాకింగ్ ద్వారా గుర్తిస్తామని అటవీశాఖ అధికారులు స్పష్టం చేశారు. కొండ ప్రాంతాలకు వెళ్లే వారంతా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏదైనా అత్యవసరమైతే తప్ప కొండ ప్రాంతాలకు వెళ్ళొద్దని సూచించారు. నేలకోట పెద్ద కొండేపూడి చీపురుపల్లి ప్రాంతాల్లో ఉన్న పశువులు గొర్రెలు మేకలు తదితర జీవాలనుకాపాడుకునేలా రైతుల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా సమాచారం ఉంటే అటవీ శాఖ అధికారులకు లేదా పోలీస్ అధికారులకు సీతానగరం తాసిల్దార్ కు సమాచారం అందించాలన్నారు.

# గ్రామీణ ప్రజలకు చేరువలో ప్రాథమిక వైద్య సేవలు





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, అక్టోబర్ 6:**రాష్ట్రంలో నూతనంగా నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల భవనాలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి గుడివాడ నుంచి మంగళవారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఇందులో భాగంగా తూర్పు గోదావరి జిల్లాలో నిర్మించిన 6 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల భవనాలను జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం, బొమ్మూరులో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో వర్చువల్‌గా ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు, అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, డిఆర్వో ఎస్.భాస్కర్ రెడ్డి, డి.ఎమ్.హెచ్.వో పి.కోమలి, డి.సి.హెచ్.ఎస్ ఎమ్.పద్మ, ఎస్ ఈ పి ఆర్ కె.బాలకృష్ణ లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

**వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స కంటే నివారణే ముఖ్యం: జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి**

కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ ప్రస్తుతం అంటువ్యాధుల కంటే అంటువ్యాధులు కాని వ్యాధులు బీపీ, మధుమేహం, క్యాన్సర్ తదితరాలు పెరుగుతున్నాయని తెలిపారు. జీవనశైలిలో వచ్చిన మార్పులు దీనికి ప్రధాన కారణాల్లో ఒకటని పేర్కొన్నారు. గంటల తరబడి ఒకే చోట కూర్చోవడం వల్ల శారీరక కదలికలు తగ్గుతున్నాయని, సమావేశాలు, కార్యాలయ పనుల మధ్యలో విరామం తీసుకుని నడక, వ్యాయామం వంటి శారీరక కార్యకలాపాలు చేపట్టాలని సూచించారు.వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స పొందడం కంటే వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే ప్రాథమిక ఆరోగ్య రక్షణలో కీలకమని కలెక్టర్ స్పష్టం చేశారు. పిల్లల్లో రక్తహీనత తగ్గించడం, గర్భిణులకు తగిన పోషకాహారం అందేలా చూడటం, పాఠశాలలు, అంగన్‌వాడీల పరిసరాల్లో జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. చిక్కీలు, నువ్వుల ఉండలు వంటి పోషకాహారాన్ని ప్రోత్సహించాలని సూచించారు.

**ప్రతి ఇంటికీ ఆరోగ్య అవగాహన**

గ్రామ స్థాయిలో ప్రతి కుటుంబ పరిస్థితిని తెలుసుకునే ఫ్రంట్‌లైన్ ఆరోగ్య సిబ్బంది ప్రజల్లో ఆరోగ్యకరమైన జీవనశైలి, సరైన ఆహారపు అలవాట్లు, వ్యాయామం, వ్యాధుల నివారణపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు కీలక పాత్ర పోషించాలని ఆమె పేర్కొన్నారు.అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు నివారణ ఆరోగ్యంపై అవగాహన పెంచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్స్‌ను విస్తరించడం, ఎంఎల్‌హెచ్‌పీల సేవలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రజల ఇళ్లకు చేరువగా ప్రాథమిక వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. వ్యాధుల నివారణలో యోగా, పారిశుధ్యం, సమతుల్య పోషకాహారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. "నివారణే మేలైన మార్గం" అనే భావనను ప్రజల్లో బలంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... వైద్య వృత్తి అత్యంత బాధ్యతతో కూడుకున్నదని, వైద్యులు, నర్సులు, ఇతర ఆరోగ్య సిబ్బంది సేవాభావంతో పనిచేయాలని కోరారు. ఆసుపత్రికి వచ్చే రోగులను ఆప్యాయంగా పలకరించి, వారి సమస్యలను ఓపికగా విని ధైర్యం కల్పించాలని సూచించారు. వైద్య సేవల్లో సహనం, మానవతా దృక్పథం ఎంతో ముఖ్యమన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో గతంతో పోలిస్తే మెరుగైన మందులు, వైద్య పరీక్షలు, నిపుణుల సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రుల అధిక వైద్య ఖర్చులను భరించలేని పరిస్థితుల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కలిగేలా సేవలు అందించాలని కోరారు. అవసరమైన చోట వైద్యులు, నర్సింగ్ సిబ్బంది కొరతను జిల్లా కలెక్టర్, సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఆసుపత్రుల మౌలిక వసతుల అభివృద్ధికి జూ=, దాతల సహకారాన్ని కూడా వినియోగించుకోవాలని పేర్కొన్నారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.కోమలి మాట్లాడుతూ... సంజీవని కార్యక్రమం ద్వారా రోగులు ముందుగానే అపాయింట్‌మెంట్, అవసరమైన పరీక్షలు, స్పెషలిస్ట్ వైద్యుల సేవల సమయాన్ని బుక్ చేసుకునే అవకాశం ఉందన్నారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరం తగ్గుతుందని తెలిపారు. గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఎన్‌సీడీల నియంత్రణకు జీవనశైలి మార్పులు, క్రమం తప్పకుండా శారీరక శ్రమ అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.భాస్కర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. కోమలి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఎం. పద్మ, పంచాయతీరాజ్ శాఖ ఎస్‌ఈ కె..బాలకృష్ణ, వైద్య, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై పశువుల సంచారాన్ని అరికట్టాలి..
# రైతులకు అధికారుల అవగాహన..






పెన్ పవర్
EXCLUSIVE
ఎఫెక్ట్

**అడ్డతీగల, పెన్ పవర్, అక్టోబర్ 06:** జాతీయ రహదారి 516 పై పశువులు విపరీతంగా సంచరించడంతో అధికారులు ఈ విషయముపై దృష్టి సారించారు.రోడ్లపై పశువులను వదలడం వల్ల వాహనదారులకు తరచూ ప్రమాదాలకు గురి అవుతున్నారు అని అధికారులు దీనిపై దృష్టి సారించారు,పశువుల యజమానులు బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు సూచించారు. అడ్డతీగల మండలం వేటమామిడి వద్ద జాతీయ రహదారి 516ఈ పై పశువుల సంచారం కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో, సోమవారం రాత్రి ఎంపీడీవో ఏవీవీ కుమార్ పశువుల యజమానులకు హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సంబంధిత గ్రామాల్లో రైతులకు అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేటమామిడి,పైడిపుట్టపాడు,బండకొండ,పనుకురాతిపాలెం గ్రామాల్లో పశువుల యజమానులను కలిసి రహదారులపై పశువులను వదలడం వల్ల పలు ప్రమాదాలలో పశువులు మరణించడం దీని వలన కలిగే ఇబ్బందులు ప్రమాదాలు, ట్రాఫిక్‌కు ఏర్పడే అంతరాయం గురించి అధికారులు వివరించారు. పశువులను రోడ్లపైకి వదలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సూచిస్తూ రైతులకు నోటీసులు అందజేశారు. నోటీసులపై రైతుల సంతకాలు కూడా తీసుకున్నారు. పశువుల సంచారం కారణంగా వాహనదారులకు ఇబ్బందులు, ప్రమాదాలు జరగకుండా ప్రతి పశువుల యజమాని సహకరించాలని యానిమల్ హస్బెండ్రీ అసిస్టెంట్ షేక్ హుజీఫ్ ఉన్నీసా రైతులకు విజ్ఞప్తి చేశారు.

# డిప్యూటీ సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు





- కాకవాడ, రాకోటలో జాయింట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ క్షేత్రస్థాయి పరిశీలన
- హెలిప్యాడ్, శంకుస్థాపన ప్రాంతం, సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లపై సమీక్ష

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబరు 6:** పోలవరం జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఈ నెల 8న కాకవాడ, రాకోట గ్రామాల్లో పర్యటించనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు.ఈ నేపథ్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్, రంపచోడవరం సబ్ కలెక్టర్ డొనకా పృథ్వి రాజ్ కుమార్, ఇతర అధికారులు మంగళవారం కాకవాడ, రాకోట గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. ఉప ముఖ్యమంత్రి పర్యటించనున్న హెలిప్యాడ్ ప్రాంతం, రాకోటలో శంకుస్థాపన చేయనున్న ప్రదేశం, ప్రజా సమావేశ వేదిక తదితర ప్రాంతాలను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు.

**పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి**

పర్యటన నేపథ్యంలో కాకవాడ, రాకోటతో పాటు పరిసర గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రధాన రహదారులు, పర్యటన మార్గాలు, సభా ప్రాంగణం పరిసరాల్లో నిరంతర పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. ఎంపీడీవోల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి ప్రాంతాల వారీగా బాధ్యతలు అప్పగించారు. ఐదు, ఆరు, ఏడు పాయింట్ల వద్ద పారిశుద్ధ్య, ఇతర ఏర్పాట్లను సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. ఈ పనులను మారేడుమిల్లి ఎంపీడీవో ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.

**విద్యుత్ సమస్యలకు ముందస్తు పరిష్కారం**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కాకవాడ, పరిసర ప్రాంతాల్లో గుర్తించిన విద్యుత్ సంబంధిత సమస్యలను అధికారులు పరిష్కరిస్తున్నారు. తుప్పుపట్టిన స్తంభాల కింది భాగాలను సరిచేయడంతో పాటు వాలిపోయిన స్తంభాలను సరిచేశారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ఉప ముఖ్యమంత్రి పర్యటన మార్గంలో ఎలాంటి విద్యుత్ అంతరాయాలు, ప్రమాదాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

**సభా ప్రాంగణ పనులు వేగవంతం**

రాకోటలో నిర్వహించనున్న ప్రజా సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయి. సభా ప్రాంగణాన్ని సిద్ధం చేసేందుకు నాలుగు యంత్రాలు, సహాయక వాహనాలతో మైదానాన్ని చదును చేస్తున్నారు. సభా వేదిక, టెంట్లు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాట్లు ఏకకాలంలో కొనసాగుతున్నాయి.

**భద్రతా ఏర్పాట్లపై పోలీసుల పరిశీలన**

ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన భద్రతా, బందోబస్తు ఏర్పాట్లను ఓఎస్డీ (అడ్మిన్) జావళి, రంపచోడవరం ఎస్‌డీపీవో, సీఐ తదితర పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హెలిప్యాడ్, రాకోటలో శంకుస్థాపన ప్రదేశం, ప్రజా సమావేశ వేదికలను సందర్శించి బందోబస్తు, వాహనాల రాకపోకలు, ప్రజల ప్రవేశం తదితర అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు.

ఉప ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ సూచించారు. కేటాయించిన బాధ్యతలను నిర్దేశిత సమయంలో పూర్తి చేసి, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

# రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ రైతుల ఆనందం

**సీతానగరం, పెన్ పవర్, అక్టోబర్:06** రైతులు, ప్రజలు హక్కులను గౌరవిస్తూ వారికి భరోసా కల్పించడమే సుపరిపాలన లక్ష్యం అని రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు.సీతానగరం మండలంలోని మునికూడలి గ్రామంలో మంగళవారం మీ భూమి -- మీ హక్కు కార్యక్రమంలో భాగంగా రాజముద్రతో కూడిన పాసు పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూఏపిలో కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ కార్యక్రమాలు విజయవంతంగా జరుగుతున్నాయని, రైతులు, ప్రజలు అంతా ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. భూములు రీసర్వే పూర్తి అయిన గ్రామాల్లో రైతులకు పంపిణీ చేస్తున్నామనిరాష్ట్ర వ్యాప్తంగా పట్టాదారు పాసుపుస్తకాలు పంపణీపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని,గత ప్రభుత్వ చర్యలపై అన్ని వర్గాలు ప్రజలు అసంతృప్తి నేపథ్యంలో రీ సర్వే తప్పులను సరిదిద్ది కొత్త పాసుపుస్తకాలు ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చుచున్నామని తెలిపారు.భూమే ప్రాణంగా బతికే రైతులకు భూ సమస్యలు లేకుండా చేయడం మన ప్రజా ప్రభుత్వం



లక్ష్యంమని అన్నారు. గత ప్రభుత్వం అసంబద్ధంగా తెచ్చిన ల్యాండు టైటలింగు యాక్టు రద్దుతో ప్రజలకు అభద్రతను దూరం చేశామని తెలిపారు. కొత్త పాసు పుస్తకాలు పంపిణీ ప్రతి ఇంట్లో కొత్త సంతోషాన్ని తెస్తోందని, అన్నారు.ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు జనసేన,తెలుగుదేశం, బిజెపి, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## తాడేపల్లిగూడెం పురపాలక సంఘ కార్యాలయంలో
# టౌన్ ప్లానింగ్ పై అవగాహన సదస్సు





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 06.** తాడేపల్లిగూడెం పురపాలక సంఘ కార్యాలయంలో ఈరోజు టౌన్ ప్లానింగ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టౌన్ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ జి.వి. సుబ్బారావు పాల్గొన్నారు. టౌన్ ప్లానింగ్ సెక్రెటరీలకు టౌన్ ప్లానింగ్ నిబంధనలు, భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్ నిబంధనలపై ఆయన వివరంగా అవగాహన కల్పించారు.
ఈ కార్యక్రమంలో బిమున్సిపల్ కమిషనర్ ఎమ్.. యేసుబాబు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ శ్రీమతి ఎఆర్. జోష్ణ, ఏ.సి.పి సీతారాం, టి.పి.ఓ విరమళ్ళు జగదీశ్వర రావు మరియు టౌన్ ప్లానింగ్ సెక్రెటరీలు పాల్గొన్నారు.

## తాడేపల్లిగూడెం రూరల్ మండలంలో
# బీజేపీ నెలవారీ సమావేశం



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 06.** తాడేపల్లిగూడెం రూరల్ మండలంలో భారతీయ జనతా పార్టీ నెలవారీ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి భారతీయ జనతా పార్టీ తాడేపల్లిగూడెం రూరల్ మండల అధ్యక్షులు కాశీ విశ్వేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ నరసాపురం పార్లమెంట్ మీడియా కన్వీనర్ నరిసే సోమేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లిగూడెం రూరల్ మండలంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ విధానాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, ప్రతి గ్రామంలో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరించాలని ఆయన తెలిపారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంలో కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.అనంతరం పార్టీ సంస్థాగత విషయాలు, రాబోయే కార్యక్రమాలు, మండల స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే అంశాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ఈ సమావేశంలో భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, మండల స్థాయి పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆకస్మికం గా మరణించిన డ్రైవర్ యేసు
## కుటుంబం కు అండగా పేరిచర్ల సహాయం..



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 06.** కుటుంబ పెద్ద ని కోల్పోయిన సభ్యులు కు అండగా ఉండాలని వారిలో మనోధైర్యం కల్పించి బాసటగా నిలవడం మన బాధ్యత అని లయన్స్ జిల్లా 316జి రీజియన్ చైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు అన్నారు. స్థానిక టాక్సీ అసోసియేషన్ వినాయక చవితి వేడుకల్లో అశువులు బాసిన డ్రైవర్ కాకర్ల యేసు కుటుంబం కు తాడేపల్లిగూడెం డైమండ్స్. వనిత లయన్స్ క్లబ్ లు సహకారం తో రైస్.బ్యాగ్స్ నిత్యావసర వస్తువులు. నగదును అసోసియేషన్ సభ్యులు సమక్షంలో పేరిచర్ల మురళీ కృష్ణం రాజు అందచేశారు. లయన్ కొప్పిశెట్టి రమణయ్య లయన్ కాళ్ళ గోపికృష్ణ లు లయన్. సీహెచ్ లక్ష్మి. పద్మవర్మ మాట్లాడుతూ మానవతా దృష్టితో ఆ కుటుంబం కు సహాకారం అందిద్దాం అని ఓ కుటుంబం రోడ్డున పడకుండా ఆదుకుందా అన్నారు ఈ కార్యాక్రమం లో.? లయన్ తమ్మబత్తుల సత్యనారాయణ నాని టాక్సీ అసోసియేషన్ సభ్యులు
పజ్జూరి రమేష్ , సత్య ప్రసాద్ , చిన్న బాబు,బోస్,శ్రీనివాస్ , విష్ణు,సలీమ్, పేరిచర్ల ఫౌండేషన్ మెంబర్,ముదునూరి శివరామ రాజు,యేసు, సాయి రాజు
తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్
## కార్యక్రమమే ప్రజాదర్బార్. ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 06.** తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజలు, కార్యకర్తలు, నాయకులను స్వయంగా కలిసి వారి సమస్యలను తెలుసుకుని, వినతులను స్వీకరించారు. ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులను ఆదేశించి, అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ప్రజాదర్బార్ ద్వారా ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు.

# చేబ్రోలులో విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

**రూ.27 కోట్లతో ఏలూరు జిల్లాకు 135 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మంజూరు**





**పెన్ పవర్ ఉంగుటూరు, అక్టోబర్ 06:** ఉంగుటూరు మండలం చేబ్రోలు గ్రామంలో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మంగళవారం స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుతో కలిసి ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం కింద ఏలూరు జిల్లాకు రూ.27 కోట్లతో 135 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మంజూరయ్యాయని తెలిపారు. వీటిలో ఇప్పటికే 10 క్లినిక్‌ల నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. చేబ్రోలుతో పాటు నూజివీడు నియోజకవర్గంలోని చిన్న ఆగిరిపల్లిలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించినట్లు వెల్లడించారు.
గ్రామీణ ప్రాంత ప్రజలకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉపయోగపడతాయని కలెక్టర్ తెలిపారు. చేబ్రోలు గ్రామాన్ని జిల్లాలోనే అభివృద్ధికి నమూనా గ్రామంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం తదితర అన్ని రంగాల్లో గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు.చేబ్రోలు గ్రామంలో ఇప్పటికే రహదారుల అభివృద్ధి చేపట్టామని, ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించే చర్యలు కొనసాగుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు.

## తేనె పట్టు మైనం (బీస్ వ్యాక్స్) ఆధారిత ఉత్పత్తులపై డా. వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి మరో 3 నూతన పేటెంట్లు.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 06.** డా. వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని వెంకటరామన్నగూడెం ఉద్యాన కళాశాల విద్యార్థులు, తమ డిగ్రీ కోర్సు లో భాగంగా చివరి సెమిస్టర్ లో అనుభవపూర్వక అభ్యాసం(ఇపీఎల్) నిర్వహిస్తారు.
ఈ కార్యక్రమంలో భాగంగా, కోర్సు ఇంచార్జి డా.ఎన్ ఇమ్మాన్యూల్ మార్గదర్శకత్వంలో డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు రూపొందించిన తేనె పట్టు మైనం ఆధారిత వినూత్న ఉత్పత్తులపై ఇప్పటివరకు మొత్తం ఆరు (6) పేటెంట్లను సాధించి, పరిశోధనల్లో సరికొత్త మైలురాయిని ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు అధిగమించారు.
ఈ క్రమంలో ఈ రోజు బీ వ్యాక్స్ షూ పాలిష్ , ఫర్నిచర్ పాలిష్ , మరియు హెయిర్ కండిషనర్ మూడు ఉత్పత్తులపై మూడు కొత్త పేటెంట్లు మంజూరై, అధికారికంగా ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో, ఎక్స్‌పెరిమెంటల్ లెర్నింగ్ ప్రాసెస్ (ఇపీఎల్) విద్యార్థులు సాధించిన ఈ ప్రతిష్టాత్మక విజయంపై యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. కె. ధనుంజయరావు, రిజిస్ట్రార్ డా. బి. ప్రసన్న కుమార్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా. ఎస్. సూర్యకుమారి మరియు వెంకటరామన్నగూడెం ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా . చలపతిరావు, జాయింట్ రిజిస్ట్రార్ వి. ఆనంద బాబు హర్షం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉప కులపతి మాట్లాడుతూ," విద్యార్థులలోని సృజనాత్మకతను, శాస్త్రీయ నైపుణ్యాన్ని మేళవించి నూతన వ్యాపార ఆలోచనలను వెలికితీయడంలో ఈ ప్రయోగాత్మక అభ్యసన ప్రక్రియ ఎంతగానో తోడ్పడిందని కొనియాడారు. ఈ బృందానికి మార్గదర్శకులుగా వ్యవహరించిన మెంటార్ డా. ఎన్. ఇమ్మాన్యూల్ మరియు అద్భుత ప్రతిభ కనబరిచిన ఇవిల్పి విద్యార్థులను వైస్ ఛాన్సలర్ ప్రత్యేకంగా అభినందించారు.



## కలెక్టర్ కీర్తి చేకూరిని మర్యాదపూర్వకంగా
# కలిసిన నూతన సబ్ కలెక్టర్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, అక్టోబర్ 6:** రాజమహేంద్రవరం నూతన సబ్ కలెక్టర్‌గా 2023 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి శుభం నోఖ్వాల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం బొమ్మూరులోని కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి నూతన సబ్ కలెక్టర్‌కు అభినందనలు తెలియజేసి, సబ్ డివిజన్ పరిధిలో ప్రజలకు మెరుగైన పరిపాలన అందించేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన సబ్ కలెక్టర్ శుభం నోఖ్వాల్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తానన్నారు. ప్రధానంగా రీ-సర్వే పనులు, 22-ఏ భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారం, ప్రజల భూ సమస్యలపై సత్వర స్పందనతో పాటు రాబోయే గోదావరి పుష్కరాల సన్నాహక పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు పారదర్శకమైన, మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. నూతన సబ్ కలెక్టర్ శుభం నోఖ్వాల్‌ను డీఆర్వో ఎస్.భాస్కర్ రెడ్డి, ఆర్డీవో ఆర్.శివ రాముడు, సీపీవో ఎల్.అప్పలకొండ, డీపీఆర్వో ఎం.ఎల్. ఆచార్యులు, కలెక్టరేట్, సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

# మెరుగైన ఉద్యోగాలు సాధించాలంటే ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్ తప్పనిసరి



**పెన్ పవర్, అక్టోబర్ 6, 2026:**ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువ ఇంజనీర్లు మెరుగైన మంచి ఉద్యోగ ప్యాకేజీలను సాధించాలంటే ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్ అవసరమని సెంటిఫిక్ గ్లోబల్ సొల్యూషన్స్ ఇంక్. గ్లోబల్ పార్ట్‌నర్‌షిప్ లీడ్ టిట్లి బెనర్జీ అన్నారు.గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ టెక్‌వింగ్ కార్పొరేట్ డివిజన్ ఆధ్వర్యంలో మంగళవారం సెంటిఫిక్ ప్రీ-ప్లేస్‌మెంట్ టాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కీ రిసోర్స్ పర్సన్‌గా హాజరైన టిట్లి బెనర్జీ మాట్లాడుతూ, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్, సమస్య పరిష్కార సామర్థ్యం, నిరంతర అభ్యసన వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.కృత్రిమ మేధ వేగంగా మారుస్తున్న ఉద్యోగ రంగం, భవిష్యత్‌లో అవసరమయ్యే నైపుణ్యాలు, గ్లోబల్ హైరింగ్ విధానాలు, అంతర్జాతీయ స్థాయి ఉద్యోగ అవకాశాలపై ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం యూనివర్సిటీలో పరిశోధన, అభివృద్ధి భాగస్వామ్యాన్ని విస్తరించే అంశంపై విశ్వవిద్యాలయ అధికారులతో చర్చించారు. ఉమ్మడి పరిశోధన, విద్యార్థుల ఇంటర్న్‌షిప్‌లు,ఇండస్ట్రీ--అకాడెమియా సహకారం అంశాలపై చర్చలు జరిగాయి.ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ యు. చంద్రశేఖర్, డీన్ డాక్టర్ ఎన్. లీలావతి, టెక్‌వింగ్ కార్పొరేట్ డివిజన్ సి ఈ ఓ చి. అనిరుధ్ గౌర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీని కలిసిన సబ్ కలెక్టర్ శుభం నోఖ్వాల్




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 6:**రాజమహేంద్రవరం నూతన సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన 2023 బ్యాచ్ ఐఏఎస్ అధికారి శుభం నోఖ్వాల్ మంగళవారం తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్‌ను ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.
ఈ సందర్భంగా ఎస్పీ డి. నరసింహ కిషోర్ శుభం నోఖ్వాల్‌కు అభినందనలు తెలిపారు.
రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీస్, రెవెన్యూ తదితర శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాల్సిన అవసరంపై ఇరువురు చర్చించారు.
ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు, శాంతిభద్రతల పరిరక్షణలో పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా వారు అభిప్రాయపడ్డారు.

## ఎన్జీవో హోమ్ అభివృద్ధికి రూ.40 లక్షలు

* నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆక్టోబర్ 6:**నగరం నడిబొడ్డున ఉన్న ఏపీ ఎన్జీవో హోమ్‌ను సుందరంగా తీర్చిదిద్దేందుకు రూ.40 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తెలిపారు. మంగళవారం ఎన్జీవో హోమ్‌ను సందర్శించిన ఆయన భవనంలోని సమస్యలు, చేపట్టాల్సిన మరమ్మతులను పరిశీలించారు. ఎన్జీవో హోమ్ మరమ్మతులకు తమ భవాని ట్రస్ట్ నుంచి రూ.10 లక్షలు, ముఖ్యమంత్రి నియోజకవర్గా నికి కేటాయించే రూ.కోటి నిధుల నుంచి మరో రూ.10 లక్షలు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.20 లక్షలు కేటాయించేలా కృషి చేస్తానన్నారు. మొత్తం రూ.40 లక్షలతో ఎన్జీవో హోమ్‌ను అభివృద్ధి చేసి ఉద్యోగులకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దు తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనుదారుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని ఆదిరెడ్డి వాసు పేర్కొన్నారు. పీఆర్సీ కమిషనర్‌ను నియమించడం, పింఛనుదారులకు అడిషనల్ క్వాంటం మంజూరు నిర్ణయాలు ఉద్యోగ వర్గాల ప్రయోజనాల కోసమేనన్నారు. జిల్లా ఎన్జీవో సంఘ అధ్యక్షుడు మీసాల మాధవరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగుల డిమాండ్లను దశలవారీగా పరిష్కరిస్తోందన్నారు. . ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘ ఉపాధ్యక్షులు సత్యనారాయణ రాజు, రాష్ట్ర జేఏసీ కార్యదర్శి వేణుమాధవ్, జిల్లా కార్యదర్శి విజయ్ కృష్ణ, నగర సంఘ అధ్యక్షులు అనిల్ కుమార్, నగర టీడీపీ అధ్యక్షులు మజ్జి రాంబాబు, వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఈనెల 10 నుంచి కాంగ్రెస్ క్షేత్రస్థాయి ఉద్యమం




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 6:**ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాస్వామ్యాన్ని ఖునీ చేస్తూ దేశంలో నియంత పాలన చేస్తున్నారని, ఆయనకు ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గర పడ్డాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో జరిగిన అవకతవకలు, ఎన్నికల కమీషన్ నిర్ణయాలను నిరసిస్తూ ఈనెల 10 నుంచి వచ్చే నెల 26వ తేదీ వరకు 45 రోజుల క్షేత్రస్థాయి ఉద్యమాన్ని ఎఐసిసి, పిసిసి పిలుపు మేరకు చేపడుతున్నట్టు వెల్లడించారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్లమెంట్ కో ఆర్డినేటర్ టీకే విశ్వేశ్వరరెడ్డి, అర్బన్ జిల్లా అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, పిసిసి ప్రధాన కార్యదర్శి ఆకుల భాగ్యలక్ష్మి మాట్లాడారు. దేశంలో 13 కోట్ల ఓట్లను తొలగించారని, రాజ్యాంగాన్ని గౌరవించని వ్యక్తులను కమీషనర్లుగా నియమించారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో కీలకమైన ఓటు హక్కును తొలగించడమే కాకుండా అడ్డుకోవడానికి యత్నిస్తున్న ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై, కాంగ్రెస్ పార్టీపై బీజేపీ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. మోడీ ప్రతీరోజు అబద్ధాలు చెబుతూ ప్రజలను మోసగిస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీపై విమర్శలు చేసిన బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజుపై వారు ఆగ్రహం వ్యక్తం చేసారు. బీజేపీ ఏ పార్టీతో పొత్తు పెట్టుకుంటే ఆ పార్టీ నుంచి ఎమ్మెల్సీ పదవి పొందే ఆయనకు రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి లేదని వ్యాఖ్యానించారు. మోదీ అదానీ, అంబానీలకు లక్షల కోట్లు రుణ మాఫీలు చేయడమే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. సిఇసి జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేసే వరకు కాంగ్రెస్ ఉద్యమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మోతా శారద, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రాజశేఖర్, బత్తిన చంద్ర రావు, తాడి సూరిబాబు, షేక్ లలిత తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన పారిశుధ్యాన్ని అందించాలి






**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 6:**నగరంలో పారిశుధ్య పనులు నిరంతరం సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. నగరపాలక సంస్థ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో పబ్లిక్ హెల్త్ అధికారులు, సిబ్బందితో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్లలో జరుగుతున్న పారిశుధ్య పనులు, ఇంటింటికి చెత్త సేకరణ, సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం, తదితర అంశాలపై సమీక్షించారు. ప్రతిరోజూ క్షేత్రస్థాయి పరిశీలనలు తప్పనిసరి అని, ప్రజల అభిప్రాయాలు ముఖ్యమన్నారు. పారిశుధ్యంపై నిర్వహించే ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ఆశించిన రీతిలో మంచి ఫలితాలు సాధించాలంటే.. ప్రజల స్పందనను పెంచడం, క్షేత్రస్థాయిలో మార్పు తీసుకురావడం ముఖ్యమన్నారు. ఇంటింటి చెత్త సేకరణ సంపూర్ణంగా నిర్వహించాలన్నారు. నగరంలోని వాణిజ్య సంస్థలు, దుకాణాలపై షీ టీమ్స్ దాడులు నిర్వహిస్తూ.. నిషేధిత సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ ను స్వాధీనం చేసుకుని, జరిమానాలు విధించాలన్నారు. ఇప్పటివరకు ఎన్ని దుకాణాలపై దాడులు నిర్వహించింది? ఎంత ప్లాస్టిక్ స్వాధీనం చేసుకుంది? ఎంత మొత్తం జరిమానాలు విధించారో అడిగి తెలుసుకున్నారు. ఖాళీ స్థలాలలో పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరగకుండా.. వర్షపు నీరు నిల్వ , దోమలు వ్యాప్తి చెందకుండా ప్లాట్ల యజమానులు శుభ్రం చేయించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సైడ్ డ్రెయిన్లలో పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలని.. ఎక్కడైనా డ్రెయిన్లు ఆక్రమణకు గురైతే ప్లానింగ్ సెక్రటరీల సాయంతో వెంటనే వాటిని తొలగించాలన్నారు. రోడ్ల వెంబడి భవన నిర్మాణ వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. నైట్ శానిటేషన్ పై నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి అని సూచించారు. రోడ్లపైన పశువులు, పందుల సంచారం ఉండకూడదన్నారు. నగర పారిశుధ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది కృషి చేసి.. మెరుగైన ఫలితాలు తీసుకురావాలని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, ఎంహెచ్ఓ వినూత్న, శానిటరీ సూపర్ వైజర్లు, శానిటరీ ఇన్స్ పెక్టర్లు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## అడ్వకేట్ ప్రొడక్షన్ యాక్ట్ అమలు కోరుతూ 2 రోజు రిలే నిరాహార దీక్షలు.

**బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు భవన సముదాయ వద్ద న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి నిరసన**






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 06.**ఆంధ్రప్రదేశ్ లో అడ్వకేట్ ప్రొడక్షన్ యాక్ట్ అమలు చేయాలని కోరుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఫెడరేషన్ ఏలూరు పిలుపు మేరకు ది. 05-10-2026 సోమవారం నుండి ది. 09- 10- 2026 శుక్రవారం వరకు జరుగు కార్యక్రమంలో భాగంగా రిలే నిరాహార దీక్షలకు తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు భవన సముదాయ వద్ద మంగళవారం న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమాలు తెలియజేస్తూ, రిలే నిరాహార దీక్షలు చేయుచున్నారు ఈ నిరసన దీక్షకు సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కర్రి నాగేశ్వరావు, ఐలు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు పుట్టా వేణుగోపాల చౌదరి, బిజెపి నాయకులు కోట రాంబాబు, జనసేన నాయకులు అడబాల నారాయణమూర్తి, న్యాయవాదుల శిబిరం దగ్గరకు వచ్చి తమ మద్దతును తెలియజేశారు న్యాయవాదులు న్యాయమైన కోర్కెలు నెరవేర్చటానికి ప్రభుత్వాలు చొరవ చూపాలని వారు అన్నారు. రెండవ రోజు మంగళవారం కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కంకట శ్రీనివాసరావు, న్యాయవాదులు మానుకొండ గోపాలరావు, టి. లీల మాధవ్ మామిడి దానవరప్రసాద్, మానేపల్లి సుబ్బారావు గుప్తా, ఎం. ఉదయభాస్కర్, యడవల్లి మణికంత తేజ, కన్నాజి సతీష్, రెడ్డి శ్రీనివాస్, వైబోయిన మారుతి, మహిళా న్యాయవాదులు గింజాల సుశీల, తాత్రాజు వరలక్ష్మి, కె. శ్రీ లక్ష్మి నీరజ,తదితరులు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు.

# మెరుగైన పారిశుధ్యాన్ని అందించాలి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 6:**నగరంలో పారిశుధ్య పనులు నిరంతరం సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. నగరపాలక సంస్థ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో పబ్లిక్ హెల్త్ అధికారులు, సిబ్బందితో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్లలో జరుగుతున్న పారిశుధ్య పనులు, ఇంటింటికి చెత్త సేకరణ, సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం, తదితర అంశాలపై సమీక్షించారు. ప్రతిరోజూ క్షేత్రస్థాయి పరిశీలనలు తప్పనిసరి అని, ప్రజల అభిప్రాయాలు ముఖ్యమన్నారు. పారిశుధ్యంపై నిర్వహించే ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ఆశించిన రీతిలో మంచి ఫలితాలు సాధించాలంటే.. ప్రజల స్పందనను పెంచడం, క్షేత్రస్థాయిలో మార్పు తీసుకురావడం ముఖ్యమన్నారు. ఇంటింటి చెత్త సేకరణ సంపూర్ణంగా నిర్వహించాలన్నారు. నగరంలోని వాణిజ్య సంస్థలు, దుకాణాలపై షీ టీమ్స్ దాడులు నిర్వహిస్తూ.. నిషేధిత సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ ను స్వాధీనం చేసుకుని, జరిమానాలు విధించాలన్నారు. ఇప్పటివరకు ఎన్ని దుకాణాలపై దాడులు నిర్వహించింది? ఎంత ప్లాస్టిక్ స్వాధీనం చేసుకుంది? ఎంత మొత్తం జరిమానాలు విధించారో అడిగి తెలుసుకున్నారు. ఖాళీ స్థలాలలో పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరగకుండా.. వర్షపు నీరు నిల్వ , దోమలు వ్యాప్తి చెందకుండా ప్లాట్ల యజమానులు శుభ్రం చేయించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సైడ్ డ్రెయిన్లలో పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలని.. ఎక్కడైనా డ్రెయిన్లు ఆక్రమణకు గురైతే ప్లానింగ్ సెక్రటరీల సాయంతో వెంటనే వాటిని తొలగించాలన్నారు. రోడ్ల వెంబడి భవన నిర్మాణ వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. నైట్ శానిటేషన్ పై నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి అని సూచించారు. రోడ్లపైన పశువులు, పందుల సంచారం ఉండకూడదన్నారు. నగర పారిశుధ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది కృషి చేసి.. మెరుగైన ఫలితాలు తీసుకురావాలని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, ఎంహెచ్ఓ వినూత్న, శానిటరీ సూపర్ వైజర్లు, శానిటరీ ఇన్స్ పెక్టర్లు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# గోకవరం లో వర్మీ కంపోస్ట్ తయారీపై ఎక్స్‌పోజర్ విజిట్





కమిషనర్ ఆదేశాలతో ప్రత్యేక శిక్షణ.

**గోకవరం పెన్ పవర్ అక్టోబర్ 06 :-** పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు తూర్పుగోదావరి జిల్లా పంచాయతీ అభివృద్ధి అధికారి సూచనలు జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ వారి ప్రత్యేక చొరవతో గోకవరం మండలంలో వినూత్న కార్యక్రమం నిర్వహించారు.

**14 పంచాయతీల సిబ్బంది భాగస్వామ్యం:--**

మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు చెందిన పంచాయతీ అభివృద్ధి అధికారులు, ప్రతి పంచాయతీ నుండి ఒక క్లాత్ మిత్ర,స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్ సోమ,మంగళవారం గోకవరం షెడ్ వద్ద నిర్వహించిన ఎక్స్‌పోజర్ విజిట్ లో పాల్గొన్నారు. ఈ శిక్షణలో సిబ్బందికి పలు కీలక అంశాలపై ప్రాయోగిక అవగాహన కల్పించారు.వ్యర్థాల నుండి తడి-పొడి చెత్తను మూలాల్లోనే వేరు చేయడం,ఘన వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేయడం,వర్మీ కంపోస్ట్ తయారీ విధానం మరియు దాని వినియోగం -గ్రామ పంచాయతీలలో సమర్థవంతమైన పారిశుధ్య నిర్వహణ సంపద సృష్టి - ప్రధానాంశాలుగా గోకవరం ఎంపీడీవో ఎం గోవిందు అవగాహన కల్పించారు.

**భద్రతా ప్రమాణాలపై దిశానిర్దేశం:**

విధి నిర్వహణ సమయంలో స్వచ్ఛ సిబ్బంది తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని, రేడియం/రిఫ్లెక్టివ్ జాకెట్లు ధరించాలని డిప్యూటీ ఎంపీడీఓ సూర్యనారాయణ రెడ్డి సూచించారు.

**స్వచ్ఛ గ్రామమే లక్ష్యం:**

సేంద్రీయ వ్యర్థాలను వర్మీ కంపోస్ట్ గా మార్చడం ద్వారా గ్రామాలను స్వచ్ఛంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దడంతో పాటు రైతులకు మేలైన ఎరువును అందించవచ్చని అధికారులు తెలిపారు. ఈ శిక్షణ గ్రామాల అభివృద్ధికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.ఈ అవగాహన కార్యక్రమంలో గోకవరం పీడీఓ సూరిబాబు మరియు మండల సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఐకోష్‌తో విద్యార్థులకు జాతీయ స్థాయి అవకాశాలు








- భారతీయ డేటాతో కృత్రిమ మేధస్సు పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలి
- ఏపీ నిట్ డిజిగ్నేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి. కృష్ణారావు

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. అక్టోబర్ 06.** కృత్రిమ మేధస్సు రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఏపీ నిట్ డిజిగ్నేట్ డైరెక్టర్, ప్రొఫెసర్ కె.వి. కృష్ణారావు సూచించారు. భారతదేశ అవసరాలకు అనుగుణంగా రూపొందుతున్న జాతీయ కృత్రిమ మేధస్సు పర్యావరణ వ్యవస్థను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పరిశోధన, ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని ఆకాంక్షించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్) ఆధ్వర్యంలో ఏఐకోష్ విశ్వవిద్యాలయ అనుసంధాన కార్యక్రమాన్ని మంగళవారం రవీంద్ర కళా భారతి ఆడిటోరియంలో నిర్వహించారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ కె.వి.కృష్ణారావు మాట్లాడుతూ దేశీయ అవసరాలకు అనుగుణంగా స్వదేశీ కృత్రిమ మేధస్సు పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసి విస్తృతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కృత్రిమ మేధస్సు రంగంలో శరవేగంగా చోటుచేసుకుంటున్న మార్పులను విద్యార్థులు ఎప్పటికప్పుడు గమనిస్తూ, వాటికి అనుగుణంగా తమ సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని చెప్పారు. కృత్రిమ మేధస్సు రంగంలో జరుగుతున్న నూతన పరిణామాలపై విద్యార్థులు, యువత నిరంతరం అవగాహన పెంచుకోవాలని తెలిపారు. దేశాభివృద్ధి, సామాజిక ప్రయోజనాల కోసం కృత్రిమ మేధస్సును సానుకూల దిశలో వినియోగించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న జాతీయ స్థాయి వేదికలను వినియోగించుకుని తమ ఆలోచనలకు ఆచరణ రూపం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా భారతీయ డేటాతో పనిచేయడం ద్వారా దేశీయ అవసరాలకు అనుగుణమైన పరిష్కారాలను అభివృద్ధి చేసే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలను పరిశోధన, ఆవిష్కరణలుగా మలుచుకునేందుకు భారత్‌జెన్ మరియు ఏఐకోష్ వంటి వేదికలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. మరో ముఖ్య అతిథి ఇండియాఏఐ డైరెక్టర్ మహమ్మద్ వై. సఫిరుల్లా, ఐఏఎస్ మాట్లాడుతూ ఏఐకోష్‌లో అందుబాటులో ఉన్న డేటాసెట్‌లు, నమూనాలు, సాధన సముదాయాలు, వినియోగ సందర్భాలు, ప్రదర్శన పట్టికలు, నోట్‌బుక్ వాతావరణం తదితర అంశాలను ప్రత్యక్షంగా వివరించారు. ఏఐకోష్ బృందం విద్యార్థులకు ప్రాథమిక డేటా విశ్లేషణ, వినియోగ సందర్భ విశ్లేషణ మొదలగు ఆచరణాత్మక కార్యకలాపాలను నిర్వహించింది. దీనివల్ల డేటా వాస్తవ ప్రపంచాన్ని ఎలా ప్రతిబింబిస్తుందో అవగాహన చేసుకునే అవకాశం కలిగింది. ఏఐకోష్‌ను కేవలం డేటాసెట్‌లు, నమూనాల భాండాగారంగా కాకుండా ప్రయోగాలు, అభ్యాసం, పరిశోధన, ఆవిష్కరణలకు ఉపయోగపడే జాతీయ వేదికగా విద్యార్థులు వినియోగించుకోవాలని కార్యక్రమ నిర్వాహకులు సూచించారు. తదుపరి దశలో ఏపీ నిట్ విద్యార్థులు జాతీయ స్థాయి లెవల్-బి సవాల్‌లో పాల్గొననున్నారు. ఏఐకోష్ కార్యక్రమంలో పొందిన పరిజ్ఞానం, ఆచరణాత్మక నైపుణ్యాలను జాతీయ స్థాయి కృత్రిమ మేధస్సు సవాల్‌లో వినియోగించుకునే అవకాశం వారికి లభించనుంది. ఈ కార్యక్రమం ద్వారా ఏఐ విద్య, అనుభవపూర్వక అభ్యాసం, ఆవిష్కరణలతోపాటు పరిశ్రమలు, విద్యాసంస్థలు, ప్రభుత్వం మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఏపీ నిట్ ముందడుగు వేసింది. భారతీయ డేటాసెట్‌లు, జాతీయ ఏఐ వనరులను వినియోగించుకుని విద్యార్థులు అర్థవంతమైన ప్రాజెక్టులు, పరిశోధనలు చేపట్టేందుకు ఈ కార్యక్రమం ప్రేరణగా నిలిచింది. అనంతరం అతిథులను రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్లు డాక్టర్ కె. హిమబిందు, డాక్టర్ వి.సందీప్ సాలువ, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

## మారేడుమిల్లి పర్యాటకానికి ఆధునిక సొగసులు





- అరోమా కానోపి ట్రైల్ ప్రాజెక్టుకు శ్రీకారం
- ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతి కల్పించడమే లక్ష్యం
- ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

**గంగవరం /మారేడుమిల్లి, పెన్ పవర్, అక్టోబరు 6:** ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులకు సరికొత్త అనుభూతులను అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తోందని రాష్ట్ర శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. మారేడుమిల్లి అటవీశాఖ కార్యాలయంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన అరోమా కానోపి ట్రైల్ ప్రాజెక్టు ప్రారంభ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన ఆన్‌లైన్ ప్రారంభ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తిలకించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మారేడుమిల్లి ప్రకృతి అందాలకు మరింత ఆధునిక హంగులు అద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. సహజసిద్ధమైన ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాల తోటలు, సువాసనలు వెదజల్లే వృక్ష సంపదకు ఎలాంటి విఘాతం కలగకుండా అరోమా కానోపి ట్రైల్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఎత్తైన చెట్ల మధ్య నుంచి వెళ్లేలా నడక మార్గాలను ఏర్పాటు చేయడం ద్వారా పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించనున్నట్లు చెప్పారు. ఈ మార్గాల ద్వారా అడవి అందాలను, పక్షులను ఎత్తు నుంచి వీక్షించే అవకాశం కలుగుతుందన్నారు. అటవీ ప్రాధాన్యత, వృక్ష సంపద, జీవవైవిధ్యంపై పర్యాటకులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక వివరణ కేంద్రాలను కూడా ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక గిరిజనులకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు గిరిజన సంస్కృతి, జీవనోపాధికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

**మారేడుమిల్లికి అంతర్జాతీయ గుర్తింపు**

పర్యాటక రంగంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో మారేడుమిల్లికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించే అవకాశాలు ఉన్నాయని శిరీషాదేవి అన్నారు. ప్రకృతి సౌందర్యానికి అనువైన మారేడుమిల్లిలో సాహస, ప్రకృతి పర్యాటకానికి అనుగుణంగా ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి రావడం ఈ ప్రాంతానికి ఎంతో ప్రయోజనకరమన్నారు. అరోమా కానోపి ట్రైల్ ప్రకృతి ప్రేమికులకు మరపురాని అనుభూతిని అందిస్తుందని తెలిపారు.

**వేతన సమస్యల పరిష్కారానికి కృషి**

మారేడుమిల్లిలో పర్యటించిన ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవిని వీఎన్‌జీఆర్ఎంజీ ఉద్యోగుల ప్రతినిధులు మందపల్లి రామచంద్రయ్య ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. గత ఏడేళ్లుగా వేతనాల పెంపు తదితర సమస్యలు పరిష్కారం కాలేదని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.కార్యక్రమాల్లో ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ సభ్యుడు షేక్ సుభానీ, మండల పార్టీ అధ్యక్షుడు గురుకు శేషుకుమార్, సొసైటీ అధ్యక్షుడు పాము అర్జున్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కుర్ల రాజశేఖర్‌రెడ్డి, ఇతర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కలిసి పనిచేద్దాం - మునిసిపల్ విజయం సాధిద్దాం.

- యువ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింధు పైడికొండల
- బిజెపి మండల సమావేశంలో నేతల పిలుపు.



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. అక్టోబర్ 06.** నాయకులు కార్యకర్తలు కలిసి పని చేసి స్థానిక మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి కోటమి విజయం సుసాధ్యమని బీజేపీ యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింధు పైడికొండల అన్నారు. బిజెపి తాడేపల్లిగూడెం పట్టణ సమావేశంలో సింధు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. సమావేశానికి బిజెపి పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీను అధ్యక్షత వహించారు. సింధు పైడి కొండల మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికలలో బిజెపి సహా కూటమి పార్టీల అభ్యర్థుల విజయం కోసం సమిష్టిగా కృషి చేయాలని కోరారు.బిజెపి నాయకులు, కార్యకర్తలు పార్టీ కూటమి విజయమే లక్ష్యంగా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఏమైనా సమస్యలు ఉంటే పార్టీ దృష్టికి తీసుకురావాలన్నారు.. బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంచుమర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర నాయకత్వం నిర్దేశించిన ప్రకారం సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాలు తాడేపల్లిగూడెంలో దిగ్విజయంగా నిర్వహిస్తున్నారని అభినందించారు. రానున్న స్థానిక మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి సహ కూటమి అభ్యర్థులు విజయం కోసం నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు కోట రాంబాబు మాట్లాడుతూ పార్టీ నాయకులు అంతా సమన్వయంతో సమిష్టిగా పనిచేసి మరింత బలో పేతం చేయాలన్నారు బిజెపి పట్టణ మాజీ అధ్యక్షులు ముప్పిడి సురేష్ రెడ్డి మాట్లాడుతూ బిజెపి అభ్యర్థులు గా ఎంపికైన వారు అన్ని అంశాలు పరిశీలించి అవగాహనతో నామినేషన్లు వేసేందుకు సిద్ధం కావాలన్నారు. రాష్ట్ర కంచుమర్తి నాగేశ్వర రావుమాట్లాడుతూ సేవా సంకల్ప కార్యక్రమంలో భాగంగా రశీగోలి, కళా జాతల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయన్నారు. రంగోలి నిర్వహించిన మహిళా మోర్చా అధ్యక్షురాలు గోకా మహాలక్ష్మి ని అభినందించారు. పట్టణ అధ్యక్షులు దువ్వ శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర జిల్లా నాయకత్వాల ఆదేశాల మేరకు స్థానిక మునిసిపల్ ఎన్నికలలో పోటీ చేసేందుకు ఆసక్తి కలిగిన వారి నుంచి వివరాలు సేకరించడం జరిగిందని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థుల వివరాలను పార్టీ నాయకత్వానికి పంపిస్తామన్నారు. మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు గోకామహాలక్ష్మి మాట్లాడుతూ సేవా సంకల్ప కార్యక్రమాల్లో భాగంగా రంగోలి కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జిగా అందరు సహకారంతో బాధ్యతలు నిర్వర్తించానని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి చిట్యాల రాంబాబు, డి శ్రీనివాస్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మారిశెట్టి నరసింహమూర్తి, మహిళా మోర్చ జిల్లా ఉపాధ్యక్షురాలు తాడాల సూర్యకుమారి, పట్టణ ప్రధాన కార్యదర్శులు సన్నిధి లక్ష్మీ దుర్గ, తుట్టగుంట కృష్ణకుమారి, కిసాన్ మోర్చా నాయకులు చెరుకూరి గంగాధర్ రావు, ఎస్సి మోర్చా జిల్లా నాయకులు వి ఆర్ వి ఎల్ నారాయణ,ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు ఇమ్మంది బెనర్జీ, తదితరులు పాల్గొన్నారు.

## పుష్కర నిధులు, పనులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

అఖిలపక్షాలు, ప్రజా సంఘాలతో సమావేశం నిర్వహించాలి సీపీఎం డిమాండ్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 6:** గోదావరి పుష్కరాల సందర్భంగా ప్రభుత్వం కేటాయించిన నిధులు, వినియోగం, పనుల పై ప్రజలకు తెలిపేలా శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి. అరుణ్ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్ క్లబ్ లో మీడియాతో ఆయన మాట్లాడారు. పుష్కరాల పేరుతో గతంలో భారీగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టారని, ఆ నిధుల్లో ఎంత మొత్తం మంజూరైంది, ఎంత ఖర్చు చేశారు, ఏయే పనులకు నిధులు వినియోగించారనే వివరాలను ప్రభుత్వం ప్రజల ముందుంచాలని కోరారు. పుష్కర నిధుల వినియోగంపై అనుమానాలు, సందేహాలు ఉన్న క్రమంలో పూర్తి స్థాయి వివరాలను బహిర్గతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ అంశంపై అఖిలపక్ష రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, వ్యాపారులు, స్థానిక ప్రజలతో సమగ్ర సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను ప్రభుత్వం తీసుకోవాలని టి. అరుణ్ సూచించారు. నగర అభివృద్ధి, పుష్కరాల పనులు, ప్రజా సమస్యలపై ప్రజలకు స్పష్టత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలో గత 15 రోజులుగా అధికారులు రహదారుల పక్కన ఉన్న చిరు వ్యాపారుల షెడ్లు, డ్రైనేజీ స్లాబులను తొలగిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నచిన్న వ్యాపారాలపై అధికారులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ, నగరంలో పెద్ద కార్పొరేట్, ప్రైవేటు సంస్థలు భారీ నిర్మాణాలు, ఆక్రమణలలో ఇదే స్థాయిలో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చిరు వ్యాపారుల జీవనోపాధిని దెబ్బతీయకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. నగరంలో ఆక్రమణల తొలగింపులో అధికారులు పక్షపాతం లేకుండా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను పరిగణనలోకి తీసుకుని అధికారులు చర్యలు చేపట్టాలని, లేకుంటే ప్రజా సంఘాలతో కలిసి ఆందోళన చేపడతామని అరుణ్ హెచ్చరించారు. సమావేశంలో పవన్ , రావు తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# కూటమి సర్కారు ఎఫెక్ట్: ఈసారి 'దసరా' అదరహో..!

**హైదరాబాద్ పెన్ పవర్:** విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఈ నెల 11 నుంచి 20 వరకు దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు జరగనున్నాయి. అయితే.. ఏటా జరిగేదే కదా..అని అనుకోవచ్చు. కానీ, కూటమి ప్రభుత్వం ఈ ఉత్సవాలకు ప్రత్యేక హంగులు అద్ది.. అదరహో అని అనిపించేలా చేస్తోంది. సాంకేతికతను వినియోగించి.. భక్తులకు మెరుగైన సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆ విశేషాలు చూస్తే.. నిజనంగానే దసరా అదరహో..అనేలా సాగనుందనడంలో సందేహం లేదు.



**తొలిసారి ఆన్‌లైన్‌లో..**

శరన్నవరాత్రుల సందర్భంగా ఇంద్రకీలాద్రి భక్తుల కోసం ప్రత్యక్ష విశేష ఆర్జిత సేవల ఆన్‌లైన్ టికెట్లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆన్‌లైన్ విధానంలో విశేష సేవల టికెట్లను భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో కనకదుర్గ అమ్మవారి సన్నిధిలో నిర్వహించే పవిత్ర విశేష సేవల్లో భక్తులు ప్రత్యక్షంగా పాల్గొనేందుకు ఈ ఆన్‌లైన్ టికెట్లు వీలు కల్పిస్తాయి. ప్రత్యక్షంగా ఆయా సేవలను.. ఇంట్లో కూర్చునే వీక్షించడంతోపాటు పాల్గొనవచ్చు కూడా.

**పోస్టల్ సేవలు..**

దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కనకదుర్గమ్మ అమ్మవారి దసరా ప్రసాదాన్ని భక్తుల ఇంటివద్దకే చేర్చేందుకు తపాలా శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. దసరా ఉత్సవాలకు నేరుగా రాలేని భక్తుల కోసం ఈ సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఒక ప్రసాదం కిట్ ధరను 116 రూపాయలుగా నిర్ణయించారు. భక్తులు తమ సమీపంలోని ఏదైనా ప్రధాన పోస్ట్ ఆఫీస్ కి వెళ్లి కనకదుర్గమ్మ ప్రసాదం కిట్‌ను బుక్ చేసుకోవచ్చు. ఈ ప్రత్యేక ప్రసాదం కిట్‌లో లడ్డు ప్రసాదంతో పాటు శక్తి కంకణం, అమ్మవారి కుంకుమ, అక్షతలు ఉంటాయి. ఇది కూడా ఈ ఏడాది నుంచే ప్రారంభించారు.

**రారండో రండి!**

కనకదుర్గమ్మ ఆలయంలో ఈ నెల 11 నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. అలాగే, -విజయవాడ ఉత్సవ్ 2.0- పేరుతో ప్రత్యేక కార్యక్రమం కూడా ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో పలువురు కేంద్ర మంత్రులు ఆయా ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ.. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, అమలాపురం పార్లమెంటు సభ్యులు హరీష్ బాలయోగి తదితరులు.. ఆహ్వాన పత్రికలు అందించారు. కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, ప్రహ్లాద్ జోషీలను మంగళవారం ఢిల్లీలో కలుసుకుని వారికి ఆహ్వాన పత్రికలు అందజేశారు. తప్పకుండా ఆయా కార్యక్రమాల్లో పాల్గొనాలని కేంద్ర మంత్రులను కోరారు.

**లడ్డూ ఏటీఎం..**

దుర్గమ్మ ప్రసాదం కోసం క్యూలైన్‌లో నిలబడకుండా.. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లడ్డూ ఏటీఎం కూడా శరన్నవరాత్రుల్లోనే భక్తులకు అందుబాటులోకి వచ్చింది. మనకు ఎన్ని బాక్సులు(ఒక్కొక్క బాక్సులో 6 లడ్డూలు ఉంటాయి) కావాలని అనుకుంటే.. ఒక్కొక్క దానికి 100 చొప్పున చెల్లించి.. ఈ ఏటీఎం నుంచి తీసుకోవచ్చు. ఫోన్ పే, గూగుల్ పేలతో స్కాన్ చేయడం ద్వారా ఈ సౌకర్యాన్ని భక్తులు వినియోగించుకునే అవకాశం ఉంది.

# ఢిల్లీ వేదికగా బీసీ మంత్రుల కసరత్తు.. రిజర్వేషన్ల కోసం ఆఖరి పోరాటం



**హైదరాబాద్ పెన్ పవర్:** స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కోసం గట్టిపోరాటం చేస్తున్నట్లు ప్రభుత్వం సంకేతాలు పంపుతోంది. ఇప్పటికే ఈ విషయంలో హైకోర్టులో ఎదురుదెబ్బ తిన్న కూటమి ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేసిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టులో గట్టి వాదనలు వినిపించి బీసీ రిజర్వేషన్ల పెంపునకు అనుమతి తెచ్చుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ఏవిధమైన వాదనలు వినిపించాలనే అంశంపై ఢిల్లీ వేదికగా భారీ కసరత్తు చేస్తోందని చెబుతున్నారు.

బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో సుప్రీం గత తీర్పులు కూటమి సర్కారును ఆందోళనకు గురిచేస్తున్నట్లు చెబుతున్నారు. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ఏపీ ప్రభుత్వం పెంచిన బీసీ రిజర్వేషన్లు చెల్లవని హైకోర్టు తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. ఈ విషయంలో గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించిన తెలంగాణ ప్రభుత్వానికి ఇదే అనుభవం ఎదురైందని చెబుతున్నారు. దీంతో కూటమి సర్కారు న్యాయనిపుణలతో సంప్రదింపులు మొదలుపెట్టిందని ప్రచారం జరుగుతోంది. రిజర్వేషన్ల పరిమితి లక్ష్మణరేఖ ఏం కాదని, అవసరమైన సందర్భాల్లో పెంచడంలో తప్పులేదని ప్రభుత్వం వాదిస్తోంది.ఈ విషయాన్ని సుప్రీంకోర్టుకు నివేదించడం ఎలా అన్న విషయమై విస్తృత సంప్రదింపులు జరుపుతోందని అంటున్నారు. ప్రధానంగా 34 శాతం బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా సుప్రీం తీర్పు కోసం ముమ్మరంగా ప్రయత్నిస్తున్న ప్రభుత్వం ఆ బాధ్యతలను బీసీ నేతలకు అప్పగించిందని చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో బీసీ సామాజికవర్గానికి చెందిన మంత్రులు ఢిల్లీలో మకాం వేశారు. కేంద్ర పౌరవిమానయాన మంత్రి రామ్మోహననాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి తదితరులు ఢిల్లీలో న్యాయనిపుణులతో వరుసగా సమావేశమవుతూ సుప్రీంకోర్టులో వినిపించాల్సిన వాదనలపై మార్గనిర్దేశం చేస్తున్నారని అంటున్నారు. గత శనివారం హైకోర్టు తీర్పుపై ప్రభుత్వం అప్పీలు చేయగా, ఈ వారంలో విచారణకు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.

**రాజకీయ వ్యూహం**

సుప్రీం విచారణలో ఏ విధమైన వాదనలు వినిపించాలనే అంశంతోపాటు పెంచిన రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు జరిగేలా ఆదేశాలు పొందడం బీసీ మంత్రుల లక్ష్యంగా పెట్టుకున్నారని చెబుతున్నారు. అయితే ప్రభుత్వ వాదనతో సుప్రీం ఏకీభవించని పక్షంలో రాజకీయంగా నష్టం లేకుండా ఏ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలనే అంశాన్ని కూటమి నేతలు ముందుగానే సిద్ధం చేసుకుంటున్నట్లు కనిపిస్తోందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం తాము చిత్తశుద్ధిగా పనిచేశామని, ఇందుకు బీసీ నేతలే సాక్ష్యమని ప్రచారం చేసుకోవడంలో భాగంగా సీనియర్ మంత్రులను ఢిల్లీకి పంపినట్లుగా భావిస్తున్నారు. మొత్తానికి బీసీ రిజర్వేషన్లపై చివరి వరకు పోరాడాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం పనిచేస్తోందని చాటిచెప్పేలా పక్కా ప్లాన్ తో ప్రభుత్వం అడుగులు వేస్తోందని అంటున్నారు.

# వైసీపీలో జలధార వణుకు..

**కడప, అక్టోబరు 6, పెన్ పవర్:**

కడప జిల్లా ప్రొద్దుటూరు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అడుగుపెట్టి అమరజీవి జలధార పథకానికి శ్రీకారం చుట్టడం చూసి తాడేపల్లి సహా స్థానిక వైసీపీ నేతలకు గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్లయింది. పల్లెల్లోని ప్రతి గడపకూ తాగునీటి కుళాయి కనెక్షన్లు ఇచ్చి దాహం తీర్చే బృహత్తర కార్యక్రమం తమ ఇలాకాలో మొదలవుతుంటే.. అయ్యో, వీళ్లు ఇంత మంచి పని చేస్తే ఇక కడప గడ్డపై మా ఉనికేం కావాలి.. మా ప్యాలెస్ పలుకుబడి ఏమైపోవాలి అన్న భయం వైసీపీ నేతలను నిలువునా దహించివేస్తోంది. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేక, ప్రజల్లో తమ పరపతి ఎక్కడ గల్లంతవుతుందోనన్న బెంగతో చిత్రవిచిత్ర విన్యాసాలకు తెరలేపారు.

తాము అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో రాయలసీమకు చేసిందేమీ లేకపోయినా.. ఇప్పుడు కూటమి సర్కార్ రాయలసీమ రైజింగ్ కింద సుమారు లక్ష కోట్ల భారీ ప్రణాళికతో హార్టికల్చర్ హబ్, ప్రాజెక్టుల అభివృద్ధికి శ్రీకారం చుడుతుంటే వైసీపీ తట్టుకోలేకపోతోంది. ప్రభుత్వం ఒక విజన్‌తో అడుగులు వేస్తుంటే, దాన్ని డైవర్ట్ చేసేందుకు తమదైన ఫేక్ ఫ్యాక్టరీకి పనిచెప్పారు. ప్రొద్దుటూరు పరిసరాల్లో అర్థరాత్రి వేళ దొంగచాటుగా వెళ్లి.. పంటలు ఎండిపోతున్నాయి.. రూ. లక్ష కోట్లు ఎక్కడ అంటూ వింత పోస్టర్లు పొలాల్లో పెట్టారు. ఆ వీడియోలు తీసుకుని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారు. అయితే ఇందులో అసలైన కామెడీ ఏమిటంటే.. ఆ పోస్టర్లు వేసింది తామేనని చెప్పుకునే కనీస దమ్ము, ధైర్యం కూడా వైసీపీ నేతలకు లేకపోవడమే!పోస్టర్ల కింద దర్జాగా పార్టీ పేరు గానీ, పార్టీ గుర్తు గానీ పెట్టుకోలేక.. రాయలసీమ రైతులు అనే ముసుగు తగిలించుకుని దొంగచాటు రాజకీయం నడుపుతున్నారు. ఆ పోస్టర్లు వేయించింది ఎవరో, ఆ స్క్రిప్ట్ ఎవరిదో పసిగట్టడానికి ప్రజలకు పెద్దగా పరిశోధనలేమీ అక్కర్లేదు. రాజకీయాల్లో విమర్శలు చేయాలంటే గుండెల నిండా ధైర్యం ఉండాలి, కానీ ఇలా రైతుల పేరుతో తెరవెనుక దాక్కుని దొంగ పోస్టర్లు అంటించడం వైసీపీ రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనం. ప్రజల ముందుకు వచ్చి మాట్లాడే మొహం లేక, ఇలా ట్యాగ్‌లైన్ల వెనుక దాక్కోవడం కడప రాజకీయ చరిత్రలోనే ఒక వింత రికార్డు అనే సెటైర్లు వినిపిస్తున్నాయి.జగన్ రెడ్డి అధికారంలో ఉన్నన్నాళ్లూ కడప జిల్లా రైతులే కాదు, చివరకు పులివెందుల రైతులు కూడా సాగునీరు, తాగునీరు అందక నానా ఇబ్బందులు పడ్డారు. ఆ ఐదేళ్లూ నోరు మెదపని నాయకులు.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా సీమను సస్యశ్యామలం చేసేందుకు నిధులు సమకూరుస్తుంటే ఓర్వలేకపోతున్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు జిల్లాకు చేసిందేమీ లేకపోయినా, ఇప్పుడు ఇంటింటికీ కుళాయి నీరు, రైతులకు ఉద్యానవన ప్రాజెక్టులు వస్తుంటే మాత్రం పోస్టర్లు వేసి సంతృప్తి పడుతున్నారు.

**గ్రామాల్లో ఫ్యాన్ ఖాళీ**

2024 ఎన్నికల సమయం లో తాడేపల్లిగూడెం లో నిర్వహించిన కూటమి సభ కూటమి పార్టీల అభిమానులకు ఒక మధుర జ్ఞాపకం అని చెప్పొచ్చు. పవన్ కళ్యాణ్ ఎంతో ఆవేశంతో వైసీపీ పార్టీ ని పాతాళంలోకి తొక్కకపోతే నా పేరు పవన్ కళ్యాణ్ కాదు , నా పార్టీ జనసేన కాదు అని పెద్ద సవాల్ విసరడం వంటివి మనం అంత తేలికగా మనం మర్చిపోగలమా చెప్పండి. అప్పట్లో ఈ సవాల్ ని వైసీపీ వాళ్ళు చాలా కామెడీ గా తీసుకున్నారు. కానీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత వాళ్లకు మబ్బులు వీడిపోయాయి. పవన్ కళ్యాణ్ చెప్పిందే చేసాడు కదా అని అప్పుడు బాధపడ్డారు. అయితే అది కేవలం టీజర్ మాత్రమే.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు గ్రామాల్లో వైసీపీ ని ఖాళీ చేసే వ్యూహాన్ని రచించాడు పవన్ కళ్యాణ్. ఇప్పటికే గ్రామాల్లో వేల సంఖ్యలో వైసీపీ క్యాడర్ జనసేన పార్టీ కి షిఫ్ట్ అవుతూ వస్తోంది. గ్రామీణ ఎన్నికలు మొదలయ్యేలోపు వైసీపీ క్యాడర్ మొత్తాన్ని జనసేన కి షిఫ్ట్ అయ్యేలా మాస్టర్ ప్లాన్ వేసాడు పవన్ కళ్యాణ్. ఇదే కనుక జరిగితే జగన్ కి చావుదెబ్బ నే అని చెప్పొచ్చు. మాజీ సీఎం జగన్ తాను గతం లో చేసిన తప్పులు , పొరపాట్లను సరిదిద్దుకొని , ముందుకు వెళ్తే ఈరోజు ఇలాంటి పరిస్థితి ఉండేది కాదు. తాను ఇప్పటికీ అద్భుతమైన పాలన ని అందించానని , దొంగ ఈవీఎం లు వాడి కూటమి పార్టీలు అధికారం లోకి వచ్చాయనే ఊహల్లోనే జగన్ మరియు ఆయన అనుచరులు ఉన్నారు. ఇలాంటి ఊహల్లో ఉన్నంత కాలం టీడీపీ , జనసేన పార్టీ లకు తిరుగు ఉండదు అనే చెప్పాలి.విజయనగరం జిల్లాలో వైసీపీ పార్టీ పరిస్థితి ఎలా తయారైందో చూస్తూనే ఉన్నాం. మన కళ్ల ముందే ఆ పార్టీ కుప్పకూలిపోయింది. వైసీపీ క్యాడర్ మొత్తం ఇప్పుడు టీడీపీ సొంతమైంది. అతి త్వరలోనే బొత్స సత్యనారాయణ జనసేన పార్టీ లో చేరే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. అదే కనుక జరిగితే విజయనగరం జిల్లాలో వైసీపీ పార్టీ పునాదులతో సహా కొట్టుకుపోయినట్టే అని చెప్పొచ్చు. ఇదే తరహా ఆపరేషన్ ని టీడీపీ , జనసేన అన్ని జిల్లాల్లోనూ చేస్తోంది. ముఖ్యంగా జనసేన పార్టీ లో స్పేస్ ఎక్కువ ఉండడం తో వైసీపీ బడా లీడర్లు చేరుతున్నారు. అనుకున్నది అనుకున్నట్టు చేస్తే వచ్చే ఏడాది లో పాదయాత్ర చేస్తానన్న జగన్ కి చుక్కలు కనిపిస్తాయి. ఎందుకంటే అత్యధిక శాతం వైసీపీ క్యాడర్ టీడీపీ , జనసేన పార్టీల్లో ఉంటాయి , పాదయాత్ర కి కావాల్సినంత డబ్బు పెట్టే నాయకులు కూడా ఉండరు. చూడాలి మరి ఏమి జరగబోతుంది అనేది.

# వ్యూహాలు సరే... ఆచరణ సాధ్యమేనా

**గుంటూరు, అక్టోబరు 6, పెన్ పవర్:** స్థానిక సంస్థల ఎన్నికలు ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అత్యంత ప్రాధాన్యత కలిగిన సవాలుగా మారాయి. 2024 సాధారణ ఎన్నికల ఓటమి తర్వాత పార్టీ క్యాడర్‌లో నెలకొన్న నైరాశ్యాన్ని తుడిచిపెట్టేందుకు అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి చావో రేవో తేల్చుకోవడానికే సిద్ధమయ్యారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జిల్లాల వారీగా రీజినల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో సుదీర్ఘ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ, స్థానిక ఎన్నికలను లైట్ తీసుకోవద్దని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. అధికార పక్షం నుంచి ఎలాంటి ఎదురుదెబ్బలు తగిలినా, ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ప్రతీ స్థానంలో అభ్యర్థులను నిలబెట్టి పోటీని రసవత్తరంగా మార్చడమే జగన్ ప్రాథమిక వ్యూహంగా కనిపిస్తోంది.ఈసారి స్థానిక సమరంలో వైఎస్సార్‌సీపీ వ్యూహం మునుపటి కంటే చాలా భిన్నంగా ఉంది. ప్రతీ స్థానానికి సంబంధించి ప్రతిపాదించిన అభ్యర్థుల బలాబలాలను జగన్ స్వయంగా వడపోస్తున్నారు. అభ్యర్థి పార్టీకి ఎంత విధేయుడు? కేసులకు భయపడకుండా నిలబడగలడా? గెలిచాక పార్టీ మారకుండా ఉంటాడా? అనే అంశాల ఆధారంగానే బి-ఫామ్‌లు ఖరారు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ ఇన్చార్జ్‌లు సరిగా పనిచేయకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిస్తూ, అధిష్టానం వద్ద ఉన్న సమాచారంతో జిల్లాల నివేదికలను సరిపోల్చుకుంటున్నారు. ఓడినా గెలిచినా బరిలో నిలవడం ద్వారా మాత్రమే పార్టీ శ్రేణుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపవచ్చని జగన్ బలంగా నమ్ముతున్నారు.ఇదే సమయంలో, అధికార తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిలోని అంతర్గత విభేదాలను క్యాష్ చేసుకోవడానికి వైఎస్సార్‌సీపీ పావులు కదుపుతోంది. ముఖ్యంగా మున్సిపల్ కార్పొరేషన్లు, పురపాలక సంఘాల్లో మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల స్థానాలకు నేరుగా ఎన్నికలు జరుగుతుండటంతో ఆశావహుల పోటీ కూటమిలో పీక్స్‌కు చేరింది. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు వంటి ప్రధాన కార్పొరేషన్లలో మేయర్ సీటు కోసం టీడీపీలోని బలమైన వర్గాలు, జనసేన నేతల మధ్య టికెట్ల పోరు తీవ్రమవుతోంది. కూటమిలో కిందిస్థాయి నాయకుల మధ్య సమన్వయం కుదరడం అంత తేలిక కాదన్న విషయాన్ని గుర్తించిన వైఎస్సార్‌సీపీ, అక్కడ ముదిరే విభేదాలను తమకు అనుకూలంగా మలుచుకోవాలని భావిస్తోంది.ఈ మైండ్ గేమ్‌లో భాగముగానే వైఎస్సార్‌సీపీ తమ మేయర్, చైర్మన్ అభ్యర్థుల పేర్లను ముందే ప్రకటించకుండా గుంభనంగా వ్యవహరిస్తోంది. కూటమిలో టికెట్ దక్కని అసంతృప్త నేతలు, లేదా భాగస్వామ్య పక్షాల మధ్య కుదరని పొత్తుల వల్ల ఉత్పన్నమయ్యే పరిణామాలను గమనించిన తర్వాతే తమ అభ్యర్థులను ఖరారు చేయాలనేది జగన్ ఆలోచన. అంతేకాకుండా, ముందుగానే తమ అభ్యర్థుల పేర్లు బయటపెడితే అధికార యంత్రాంగం ద్వారా వారి ఆర్థిక మూలాలపై దెబ్బకొడతారనే వ్యూహాత్మక భయం కూడా వైఎస్సార్‌సీపీని ముందస్తు ప్రకటనలు చేయకుండా అడ్డుకుంటోంది. సోషల్ మీడియాలోనూ కూటమి వైఫల్యాలను, కిందిస్థాయి నేతల ఘర్షణలను హైలైట్ చేస్తూ వైఎస్సార్‌సీపీ డిజిటల్ వింగ్ విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. పోటీ నుంచి తప్పుకుంటే పార్టీ ఆనవాళ్లు కోల్పోతాం అన్న సంకేతాన్ని జగన్ బలంగా పంపడంతో, క్షేత్రస్థాయి నాయకులు కూడా ఈ ఎన్నికలను తమ ఉనికికి పరీక్షగా భావించి సర్వశక్తులు ఒడ్డుతున్నారు. కూటమి కట్టడిని దాటుకుని స్థానిక సంస్థల్లో సత్తా చాటడం వైఎస్సార్‌సీపీకి అంత సులువైన విషయం కాదు. అయినప్పటికీ, ప్రత్యక్ష ఎన్నికల్లో కూటమి నేతల విభేదాలను ఆసరాగా చేసుకుని లబ్ధి పొందాలనే జగన్ పక్కా లీగల్ ౘ పొలిటికల్ మైండ్ గేమ్ ఏ మేర ఫలిస్తుందో రాబోయే స్థానిక ఎన్నికల ఫలితాలే తేల్చనున్నాయి.

# కొత్తగా పెన్షన్లకు 14 లక్షల దరఖాస్తులు

## ఆరంచెల తనిఖీ, డిజిటల్ ఫిల్టరేషన్

**విజయవాడ, అక్టోబరు 6, పెన్ పవర్:** ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పెంపుతో పాటు కొత్త పింఛన్ల మంజూరు అంశం అధికార కూటమి ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది. ప్రభుత్వం కొత్త దరఖాస్తులను ఆహ్వానించడంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 13.65 లక్షల కంటే ఎక్కువ అప్లికేషన్లు వచ్చి పడ్డాయి. నెలకు ప్రాథమిక పింఛను మొత్తాన్నే రూ. 4,000కు పెంచడంతో, ప్రభుత్వ ఖజానాపై ఇప్పటికే ప్రతినెలా రూ. 2,700 కోట్లకు పైగా భారం పడుతోంది. ఈ నేపథ్యంలో దాదాపు 14 లక్షలకు పైగా వచ్చిన కొత్త దరఖాస్తులన్నింటికీ ఆమోదం తెలిపి పింఛన్లు ఇవ్వడం అనేది నిధుల కొరతతో ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి ఏమాత్రం సాధ్యంకాని పని.మరోవైపు, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనర్హులకు భారీగా పింఛన్లు ఇచ్చారనే విమర్శలు ఉన్నప్పటికీ, వాటిని తొలగిస్తే రాజకీయంగా తీవ్ర వ్యతిరేకత వస్తుందనే భయం ప్రభుత్వంలో కనిపిస్తోంది. లక్షలాది మంది పాత లబ్ధిదారుల పింఛన్లను ఒకేసారి రద్దు చేస్తే, లబ్ధిదారులు వీధిలోకి రావడం, ప్రతిపక్షాలు దానిని ప్రధాన రాజకీయ అస్త్రంగా మార్చుకోవడం ఖాయం. అందువల్ల పాత లబ్ధిదారుల విషయంలో కఠినంగా వ్యవహరించేందుకు ప్రభుత్వం వెనుకంజ వేస్తోంది. ఫలితంగా అనర్హుల పింఛన్లు కొనసాగుతుండటం క్షేత్రస్థాయిలో చర్చనీయాంశంగా మారింది.ఈ పరిస్థితి అధికార పార్టీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. గతంలో ప్రత్యర్థి పార్టీకి మద్దతుగా ఉన్నవారికి పింఛన్లు అందుతున్నాయి.. ఏళ్ల తరబడి పార్టీ కోసం కష్టపడిన మాకు, మా సానుభూతిపరులకు కొత్త పింఛన్లు రాకపోతే మేమేం చేయాలి? అని కూటమి కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. తమకు దక్కాల్సిన న్యాయం జరగకపోతే, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి సహకరించడం కష్టమని కిందిస్థాయి నాయకులు బహిరంగంగానే హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామం శ్రేణులను ఏకం చేయడంలో స్థానిక ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్చార్జ్‌లకు పెద్ద సమస్యగా పరిణమించింది. ఈ సంక్లిష్ట సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం ఆరంచెల తనిఖీ, డిజిటల్ ఫిల్టరేషన్ వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలనలో దాదాపు 1.42 లక్షల దరఖాస్తులను ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల స్థాయిలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయనే కారణంతో పక్కన పెట్టారు. భూమి పరిమితి, విద్యుత్ వాడకం, ఆదాయ పన్ను, నాలుగు చక్రాల వాహనాలు వంటి సాంకేతిక ప్రామాణికాలను కఠినతరం చేసి.. అర్హత లేని వారి దరఖాస్తులను సాంకేతిక కారణాలతో తిరస్కరించడం ద్వారా రాజకీయ కక్ష సాధింపు కాదు, నిబంధనల ప్రకారమే జరిగింది అని చెప్పే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందిఅంతేకాకుండా, ఒకే విడతలో అందరికీ పింఛన్లు ఇవ్వడం సాధ్యం కాదు కాబట్టి, దశలవారీగా మంజూరు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. మొదటి విడతలో అత్యంత పేదలు, దివ్యాంగులు, తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నవారికి ప్రాధాన్యత ఇచ్చి, మిగిలిన వారి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచడం ద్వారా తాత్కాలికంగా ఉపశమనం పొందాలని చూస్తోంది. అలాగే, పాత పింఛన్లలో తీవ్రమైన బోగస్, రీ-వెరిఫికేషన్‌లో తేలిన కొన్ని స్పష్టమైన అనర్హతల ఆధారంగా మాత్రమే తొలగింపులు చేపట్టి, ఆ ఖాళీలలో క్రమంగా కొత్త కార్యకర్తలు లేదా నిజమైన అర్హులను భర్తీ చేసే మార్గాన్ని అనుసరించే అవకాశం ఉంది. కొత్త పింఛన్ల అంశం ప్రభుత్వానికి ఒక వైపు ఆర్థిక భారాన్ని, మరోవైపు స్వపక్ష కార్యకర్తల ఆగ్రహాన్ని తెచ్చిపెట్టింది. సాంకేతిక కారణాలతో ఫిల్టర్ చేయడం వల్ల తాత్కాలికంగా సమర్థించుకున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఉన్న నిజమైన అర్హులు, పార్టీ కార్యకర్తలను సంతృప్తి పరచడం కూటమి నాయకత్వానికి పెద్ద పరీక్షే. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ 'పింఛన్ల చిక్కుముడి'ని ప్రభుత్వం ఎలా విప్పుతుందనేది ఆసక్తికరంగా మారింది.

# మైసూరు మించి దసరా ఉత్సవాలు..

## ఏడు రాష్ట్రాల సీఎంలకు ఆహ్వానం

**విజయవాడ అక్టోబరు 6, పెన్ పవర్:** దసరా అంటే మైసూర్ పేరు గుర్తుకు రావడం అత్యంత సహజం. రాజవంశ సంప్రదాయం ప్రకారం మైసూర్ ప్యాలెస్ లో విద్యుత్ దీపాలను అందంగా అలంకరిస్తారు. జంబు సవారి నిర్వహిస్తారు. ఏనుగుల ఊరేగింపు జరుపుతారు. ఇలా దశాబ్దాలుగా మైసూర్ ప్రాంతంలో దసరా వేడుకలు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే ఇప్పుడు విజయవాడని కూడా దసరా టూరిజం డెస్టినేషన్ గా నిలబెట్టాలనే ప్రయత్నం జరుగుతోంది. తాజా పరిణామాలు దానిని సూచిస్తున్నాయి.అక్టోబర్ 11 నుంచి 20 వరకు విజయవాడ ఉత్సవ్ 2026 నిర్వహించబోతున్నారు. పున్నమి ఘాట్ కేంద్రంగా 10 రోజులపాటు ఉత్సవాలు నిర్వహించబోతున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు.. జానపద కళలు.. సంగీతం.. ఫుడ్ ఫెస్టివల్.. దాండియా.. మెగా కార్నివాల్.. ఎగ్జిబిషన్లు.. వినోద కార్యక్రమాలు నిర్వహించబోతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దసరా వేడుకల మీద ప్రముఖంగా దృష్టి సారించారు.వన్ సిటీ వన్ సెలబ్రేషన్ కాన్సెప్ట్ తో విజయవాడ నగరాన్ని సాంస్కృతిక టూరిజం బ్రాండ్ గా తీర్చిదిద్దడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు.కనకదుర్గమ్మ దర్శనం.. విజయవాడ ఉత్సవ్.. నేషనల్ సరస్ మేళా.. ఇలా ఈ మూడింటిని కలిపి ఒకే టూరిజం ప్యాకేజీ లాగా మార్చి.. బయటి రాష్ట్రాల పర్యటకులను ఆకర్షించాలనేది లక్ష్యంగా కనిపిస్తోంది. పున్నమి ఘాట్ లో అక్టోబర్ 8 నుంచి 23 వరకు నేషనల్ సరస్ మేళా నిర్వహించబోతున్నారు.. మైసూర్ నుంచి ఏనుగులను విజయవాడకు తీసుకువచ్చే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. ఒక రకంగా ఇది మైసూరు దసరా వాతావరణాన్ని గుర్తుచేసే అంశం. ఇప్పుడంటే ఇప్పుడు కాకపోయినా.. విజయవాడ మైసూర్ ను అధిగమించే అవకాశం ఉంది. మైసూర్ ప్రాంతానికి 1610 సంవత్సరం నుంచి దసరా ఉత్సవాల చారిత్రక సంప్రదాయం ఉంది. అయితే విజయవాడకు కనకదుర్గమ్మ ఆలయం.. కృష్ణానది.. ఆధ్యాత్మికత.. తెలుగు సంస్కృతి అదనపు ఆకర్షణగా ఉంది.దసరా ఉత్సవాలను ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. ఈ వేడుకలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తమిళనాడు సీఎం విజయ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, అస్సాం ముఖ్యమంత్రి హిమంత, ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి హాజరవుతున్నారు.. దసరా ఉత్సవాల ద్వారా విజయవాడ బ్రాండ్ మరింత పెంచడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. తద్వారా పర్యాటకపరంగా ఏపీ రాష్ట్రానికి సరికొత్త గుర్తింపు తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తోంది.టూరిజం ద్వారా ఆదాయం భారీగా వస్తూ ఉంటుంది. కేరళ నుంచి మొదలు పెడితే కర్ణాటక వరకు టూరిజం ద్వారా భారీగా ఆదాయాన్ని అక్కడ ప్రభుత్వాలు ఆర్జిస్తూ ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కూడా పర్యాటకరపరంగా అనేక అనుకూలతలు ఉన్నాయి. అందువల్లే కూటమి ప్రభుత్వం పర్యాటకపరంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సరికొత్త గుర్తింపు తీసుకురావడానికి.. మరింత ఉన్నత స్థాయిలో అభివృద్ధి చేయడానికి ప్రయత్నాలు చేస్తోంది. అందువల్లే దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ప్రణాళికలు రూపొందించింది. తద్వారా టూరిజం ఆదాయం తో పాటు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

# శ్రేయస్ సూపర్ సెంచరీ.. విండీస్‌పై భారత్ ఘన విజయం

- కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 43 బంతుల్లో 102 పరుగులతో అజేయ శతకం
- 172 పరుగుల లక్ష్యాన్ని 14.4 ఓవర్లలోనే ఛేదించిన టీమిండియా
- ఇషాన్ కిషన్‌తో కలిసి అయ్యర్ 137 పరుగుల అజేయ భాగస్వామ్యం
- ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లిన భారత్




వెస్టిండీస్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ విధ్వంసకర సెంచరీతో కదం తొక్కాడు. బౌలింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై, అయ్యర్ ఆడిన సుడిగాలి ఇన్నింగ్స్ ముందు వెస్టిండీస్ బౌలర్లు తేలిపోయారు. కేవలం 43 బంతుల్లోనే 10 ఫోర్లు, 6 సిక్సర్లతో 102 పరుగులు చేసి అజేయంగా నిలిచిన అయ్యర్.. టీమిండియాకు అద్భుత విజయాన్ని అందించాడు. అతని బ్యాటింగ్ ధాటికి 172 పరుగుల లక్ష్యం చాలా చిన్నదిగా కనిపించింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది.లక్నోలోని ఏకానా స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 19.1 ఓవర్లలో 171 పరుగులకు ఆలౌటైంది. విండీస్ బ్యాటర్లలో షాయ్ హోప్ (52), షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ (56) అర్ధ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో నమన్ ధిర్ 3 వికెట్లతో సత్తా చాటగా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం 172 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ (21), సంజూ శాంసన్ (11) తక్కువ స్కోర్లకే పెవిలియన్ చేరడంతో 35 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

ఈ క్లిష్ట దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్.. ఆట స్వరూపాన్నే మార్చేశాడు. వచ్చినప్పటి నుంచే బౌండరీలతో విరుచుకుపడ్డాడు. అతనికి ఇషాన్ కిషన్ (37 నాటౌట్) చక్కటి సహకారం అందించాడు. ఒకవైపు అయ్యర్ బౌండరీల వర్షం కురిపిస్తుండగా, మరో ఎండ్‌లో ఇషాన్ కిషన్ సంయమనంతో ఆడి వికెట్ పడకుండా జాగ్రత్తపడ్డాడు. వీరిద్దరూ కలిసి మూడో వికెట్‌కు కేవలం 67 బంతుల్లోనే 137 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అయ్యర్ తన కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను పూర్తిగా ఏకపక్షంగా మార్చేశాడు. ఫలితంగా భారత్ 14.4 ఓవర్లలోనే 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి ఘన విజయం సాధించింది. తమ ఇన్నింగ్స్ లో మరో 20 పరుగులు చేసుంటే బాగుండేదని విండీస్ భావించినప్పటికీ, అయ్యర్ బ్యాటింగ్ తీరు చూశాక మరో 60 పరుగులు చేసినా కరీబియన్లు గెలవలేరని స్పష్టమైంది.ఇక ఇరుజట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ ఈ నెల 9న రాంచీలో జరగనుంది.

# పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు భారీ షాక్.. సగం ధరకే ప్రసార హక్కుల విక్రయం!




పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. తమ దేశంలో జరిగే 25 అంతర్జాతీయ మ్యాచ్‌ల ప్రసార హక్కులను నిర్ణయించిన ధర కంటే దాదాపు సగం ధరకే విక్రయించాల్సి వచ్చింది. ప్రసార హక్కుల కోసం ప్రభుత్వ టెలివిజన్ సంస్థ 'పాకిస్థాన్ టెలివిజన్ కార్పొరేషన్' (పీటీవీ) మాత్రమే బిడ్ దాఖలు చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.పీసీబీ ఇటీవల ప్రసార హక్కుల కోసం టెండర్ జారీ చేసింది. దీనికి రూ.600 మిలియన్లను (పాకిస్థానీ రూపాయలు) రిజర్వ్ ధరగా నిర్ణయించింది. గతంలో మాదిరిగా పలు సంస్థలు కలిసి కన్సార్టియంగా బిడ్ వేసే అవకాశం ఈసారి ఇవ్వలేదు. దీంతో పోటీ తగ్గిపోయింది. చివరకు పీటీవీ రూ.350 మిలియన్లకు బిడ్ వేసి హక్కులను దక్కించుకుంది. అంటే బోర్డు నిర్ణయించిన ధరతో పోలిస్తే దాదాపు రూ.250 మిలియన్లు తక్కువకే హక్కులు విక్రయించాల్సి వచ్చింది.కొత్త ఒప్పందంలో మొత్తం 25 హోమ్ మ్యాచ్‌లు ఉన్నాయి. ఇందులో ఐదు టెస్టులు, 14 వన్డేలు, ఆరు టీ20లు ఉన్నాయి. ఈ నెలలో పాకిస్థాన్.. శ్రీలంకతో మూడు టీ20లు ఆడనుంది. ఆ తర్వాత ఇంగ్లాండ్‌తో కలిసి ఏడు మ్యాచ్‌ల ట్రై సిరీస్ జరగనుంది. వచ్చే నెలలో శ్రీలంకతో రెండు టెస్టులు కూడా ఉన్నాయి.

పాకిస్థాన్ జాతీయ జట్ల ఇటీవలి ప్రదర్శన అంతంతమాత్రంగానే ఉండటం వల్ల స్పాన్సర్లు, ప్రకటనదారులు క్రికెట్‌పై పెద్దగా ఆసక్తి చూపడం లేదని పీసీబీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు గతంలో కన్సార్టియంగా ప్రసార హక్కులు తీసుకున్న కనీసం మూడు సంస్థలు పీసీబీకి ఇంకా బకాయిలు చెల్లించాల్సి ఉంది. దీంతో ఈసారి బిడ్ వేసేందుకు ఆసక్తి చూపిన సంస్థల సంఖ్య భారీగా తగ్గిపోయింది.బకాయిలు ఉన్న సంస్థలను బిడ్డింగ్ నుంచి పీసీబీ నిషేధించలేదు. అయినా అవి స్వచ్ఛందంగా పోటీకి దూరంగా ఉన్నాయని సమాచారం. గతంలో పాకిస్థాన్ క్రికెట్ ప్రసార హక్కుల్లో ఎక్కువ భాగం దక్కించుకున్న ఓ సంస్థ కూడా ఈసారి ఆసక్తి చూపలేదు.ఇక 2027 జనవరిలో ఐర్లాండ్‌తో మూడు టీ20లతో పాటు ఐర్లాండ్, జింబాబ్వే పాల్గొనే ఏడు మ్యాచ్‌ల ట్రై సిరీస్ కూడా ఈ ప్రసార ఒప్పందంలో ఉంది. అయితే అంతర్గత బోర్డు సమస్యల కారణంగా పాకిస్థాన్ పర్యటనకు జింబాబ్వే వచ్చే పరిస్థితిలో లేదని ఇప్పటికే సంకేతాలు ఇచ్చింది.

ఇటీవల పాకిస్థాన్ సూపర్ లీగ్ 11వ సీజన్ సమయంలోనూ పీసీబీకి ప్రసార హక్కుల విషయంలో ఆశించిన స్పందన రాలేదు. గత సీజన్ హక్కులు దక్కించుకున్న ఓ ప్రసార సంస్థ ఇప్పటికీ బోర్డుకు బకాయి పడినట్లు సమాచారం. దీంతో పాకిస్థాన్ క్రికెట్ ఆర్థిక పరిస్థితిపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# 'ప్లేయర్స్ కెప్టెన్.. వ్యూహాల్లో చాలా షార్ప్'.. శ్రేయస్‌పై లక్ష్మణ్ ప్రశంసలు




ఆసియా క్రీడల్లో భారత జట్టుకు స్వర్ణం అందించిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌పై హెడ్ కోచ్ వీవీఎస్ లక్ష్మణ్ ప్రశంసలు కురిపించాడు. శ్రేయస్ ఆటగాళ్ల కెప్టెన్ అని కొనియాడాడు. ప్రతి ఆటగాడిని సౌకర్యంగా ఉంచుతూ, వారి నుంచి అత్యుత్తమ ప్రదర్శన రాబట్టే సామర్థ్యం ఉందని చెప్పాడు. కెప్టెన్‌గా అతడికి మంచి భవిష్యత్ ఉందని ఆశాభావం వ్యక్తం చేశాడు.జట్టు సమావేశాలకు ముందే శ్రేయస్ ప్రత్యర్థి బలాలు, బలహీనతలపై కసరత్తు చేస్తాడని లక్ష్మణ్ తెలిపాడు. ఫిట్‌నెస్‌కు కూడా ఎంతో ప్రాధాన్యం ఇస్తాడని చెప్పాడు. టీ20ల్లో ప్రత్యర్థి కంటే ఒకటి, రెండు అడుగులు ముందుండేలా వ్యూహాలు సిద్ధం చేసుకుంటాడని ప్రశంసించాడు.

జట్టులోని ప్రతి ఆటగాడి సామర్థ్యాన్ని శ్రేయస్ బాగా అర్థం చేసుకున్నాడని లక్ష్మణ్ అన్నాడు. పరిస్థితులకు తగ్గట్టు నిర్ణయాలు తీసుకోవడంలో అతడు చాలా చురుకుగా ఉంటాడని పేర్కొన్నాడు. బ్యాటింగ్, ఫీల్డింగ్‌లోనూ ముందుండి జట్టును నడిపిస్తాడని చెప్పాడు.

శ్రేయస్ నాయకత్వంలో భారత్ ఆసియా క్రీడల పురుషుల క్రికెట్‌లో స్వర్ణాన్ని నిలబెట్టుకుంది. ఫైనల్లో పాకిస్థాన్‌ను 19 పరుగుల తేడాతో ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 211/6 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ 28 బంతుల్లో 61 పరుగులు చేశాడు. తిలక్ వర్మ 22 బంతుల్లో అజేయంగా 51 పరుగులు సాధించాడు.లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ 192/6కే పరిమితమైంది. హసన్ నవాజ్ 51 బంతుల్లో 96 పరుగులతో పోరాడాడు. చివరి బంతికి శివమ్ దూబే అతడిని ఔట్ చేయడంతో భారత్ స్వర్ణం ఖాయం చేసుకుంది.జపాన్‌లో ప్రతికూల వాతావరణం, ప్రయాణ సమస్యలు, సాధనకు తక్కువ సమయం ఉన్నా ఆటగాళ్లు అద్భుతంగా సర్దుకుపోయారని లక్ష్మణ్ చెప్పాడు. కఠిన పరిస్థితుల్లోనూ సానుకూల దృక్పథంతో ఆడటం తనను ఆకట్టుకుందని తెలిపాడు. భారత క్రికెట్‌లో ప్రతిభావంతులైన ఆటగాళ్లకు కొదవ లేదని పేర్కొన్నాడు.

# వెండితెర ప్రేమికులుగా రియల్ కపుల్స్







నిజజీవిత జంటలు వెండితెరపై అలరించడం ఎప్పుడూ ఒక ప్రత్యేక ఆకర్షణే. నిజ జీవితంలో ప్రేమించుకుని లేదా వివాహం చేసుకుని.. ఆ తర్వాత ఆన్-స్క్రీన్‌లోనూ జంటగా కనిపించి ప్రేక్షకులను అలరించిన జోడీల ట్రెండ్ ఇప్పుడు మరింత ఊపందుకుంటోంది. టాలీవుడ్ క్రేజీ కపుల్ విజయ్ దేవరకొండ - రష్మిక మందన్న ప్రస్తుతం అత్యంత ప్రతిష్టాత్మకమైన -రణబాలి- చిత్రంలో జంటగా నటిస్తూ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచుతున్నారు. అలాగే బాలీవుడ్‌లో కొత్తగా పెళ్లయిన సోనాక్షి సిన్హా- జహీర్ ఇక్బాల్ జంటగా నటిస్తున్న -తు హై మేరి కిరణ్- సినిమా ట్రైలర్ అక్టోబర్ 6న విడుదల కానుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు స్టార్ కపుల్స్ రణ్‌బీర్ కపూర్ - ఆలియా భట్ కూడా సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం -లవ్ అండ్ వార్-తో వెండితెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమవుతున్నారు.ఈ కోవలోనే మరికొన్ని రియల్ లైఫ్ జోడీల ఆన్-స్క్రీన్ ప్రయాణం కూడా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే -షేర్షా- చిత్రంతో అందరినీ అలరించిన సిద్ధార్థ్ మల్హోత్రా- కియారా అద్వానీ జంట మరో కొత్త సినిమా కోసం సన్నాహాలు చేస్తున్నారనే వార్తలు ఫిల్మ్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతున్నాయి. అలాగే గతంలో -మహాసముద్రం- చిత్రంలో కలిసి నటించిన సిద్ధార్థ్ - అదితి రావ్ హైదరీల జోడీ కూడా రియల్ లైఫ్‌లో ఒక్కటైన తర్వాత మరో కొత్త ప్రాజెక్ట్‌లో కలిసి నటిస్తారనే ఆసక్తి అభిమానుల్లో ఉంది. ఇలా నిజ జీవితంలో జంటగా ఉన్న నటీనటులు వెండితెరపై కూడా తమ కెమిస్ట్రీని రిపీట్ చేస్తుండటం సినిమాపై అదనపు క్రేజ్‌ను తెచ్చిపెడుతోంది.ఇక టాలీవుడ్ విషయానికి వస్తే.. ఇటీవల వివాహబంధంతో ఒక్కటైన నాగచైతన్య - శోభిత ధూళిపాల జోడీని వెండితెరపై ఎప్పుడెప్పుడు చూస్తామా? అని అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ రియల్ లైఫ్ జోడీని ఒకే ఫ్రేమ్‌లో చూడాలంటే ఏ దర్శకుడు సాహసం చేస్తారనే చర్చ టాలీవుడ్‌లో జోరుగా సాగుతోంది. త్వరలో అప్‌కమింగ్ ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉన్న దర్శకుడు చందు మొండేటి లాంటి టాలెంటెడ్ డైరెక్టర్లు వీరిద్దరితో ఎలాంటి కథతో సినిమా తెస్తారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మొత్తానికి రీసెంట్ టైమ్స్‌లో రియల్ జోడీల ఆన్-స్క్రీన్ రొమాన్స్ ప్రేక్షకులకు అంతులేని వినోదాన్ని పంచుతోంది.కాస్త సీనియర్లలో అక్కినేని నాగార్జున, అమల జంట విషయానికి వస్తే.. వీరు పెళ్లికి ముందే పలు చిత్రాల్లో జంటగా నటించి ప్రేక్షకులను ఎంతగానో అలరించారు. -కిరాయి దాదాలు-,-శివ-,-ప్రేమ యుద్ధం-, -అగ్ని పుత్రుడు- వంటి విజయవంతమైన చిత్రాల్లో వీరు కలిసి నటించారు. ఆ తర్వాత పరస్పరం ఇష్టపడి పెద్దల అంగీకారంతో 1992లో వివాహం చేసుకున్నారు. అయితే విశేషం ఏమిటంటే.. పెళ్లి అయిన తర్వాత అమల పూర్తి సమయం నటనకు దూరంగా ఉంటూ కేవలం వ్యక్తిగత జీవితం -జంతు సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి పెట్టారు. అందువల్ల వీరు పెళ్లి తర్వాత ఏ సినిమాలోనూ కలిసి నటించలేదు.ఇక పలు చలనచిత్ర పరిశ్రమలలో (బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్, మాలీవుడ్) నిజ జీవితంలో ప్రేమించి పెళ్లి చేసుకున్న నటీనటులు ఆన్-స్క్రీన్‌లోనూ జంటగా అలరించిన సందర్భాలు చాలానే ఉన్నాయి. బాలీవుడ్‌లో రిషి కపూర్ - నీతూ కపూర్, అభిషేక్ బచ్చన్ - ఐశ్వర్య రాయ్, అజయ్ దేవగణ్ - కాజోల్, అలాగే ఇటీవలి కాలంలో దీపికా పదుకొణె - రణ్‌వీర్ సింగ్ వంటి జంటలు తమ నిజ జీవిత బంధానికి ముందో లేదా ఆ తర్వాతో సినిమాల్లో జంటగా నటించి మెప్పించారు. అలాగే టాలీవుడ్‌లో మహేష్ బాబు - నమ్రత (పెళ్లికి ముందు -వంశీ- చిత్రంలో), కోలీవుడ్‌లో సూర్య - జ్యోతిక (కాకా కాక, చంద్రముఖి తదితర చిత్రాలు), అజిత్ - శాలిని (అమరకలం), మాలీవుడ్‌లో బిజు మీనన్ - సంయుక్త వర్మ వంటి ఎంతోమంది రియల్ కపుల్స్ వెండితెరపై కూడా ప్రేమికులుగా- భార్యాభర్తలుగా నటించి తమ అద్భుతమైన కెమిస్ట్రీతో ప్రేక్షకులను అలరించారు.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965